



పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానంలో రాజరాజేశ్వరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన భ్రమరాంబ అమ్మవారు

వైభవంగా విజయదశమి వేడుకలు

విజయదశమి వేడుకలు వైభవంగా ముగిశాయి. నవరాత్రులు పూజలు నిర్వహించిన భక్తులు దసరా రోజు ఆలయాలకు పోటెత్తారు. భక్తిశ్రద్ధలతో సామూహిక పూజలు, సహస్ర నామార్చనలు నిర్వహించారు. అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు జరిగాయి. ప్రజలు ఆయుధ పూజలో నిమగ్నమయ్యారు. కొన్ని ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన అమ్మవారి విగ్రహాలకు ఊరేగింపు నిర్వహించి, నిమజ్జన కార్యక్రమం పూర్తిచేశారు.

- గుంటూరు, ఆంధ్రజ్యోతి

ఏఓల ప్రమోషన్‌లు.. ఇంకెప్పుడు!?

- పదోన్నతి ఫైల్‌కు కొర్రీల మీద కొర్రీలు



గుంటూరు సిటీ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ అధికారులకు ఏఓ (అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్)ల ప్రమోషన్‌లకు సంబంధించిన ఫైల్‌తో ఐంతాట ఆడుతున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఈ ప్రమోషన్‌ల ప్రక్రియ ఈ ఏడాది మేలోనే ముగిసింది. కేవలం ఉమ్మడి గుంటూరు జిల్లా లో మాత్రమే ఇంకా పురిటి నొప్పులు పడుతూనే ఉంది. సీనియర్ అసిస్టెంట్ నుంచి ఏఓలు గా ప్రమోషన్ పొందే వారి సంఖ్య తక్కువగానే ఉన్నప్పటికీ సంబంధిత ఫైల్ కు మాత్రం అధికారులు పోటీలుపడీ మరీ కొర్రీలు వేస్తుండటం చర్చనీయాం శంగా మారింది. ప్రస్తుతం ఉమ్మడి గుంటూరు జిల్లా లో 57 మండలాలు ఉండగా 67 ఏఓ పోస్టు లు ఉన్నాయి. వాటిలో సుమారు 13 ఏఓ పోస్టు లు ఖాళీ గా ఉన్నాయి. నిబంధనల ప్రకారం అధికారులు అర్హులైన సీనియర్ అసిస్టెంట్ లకు పదోన్నది కల్పించి ఆ పోస్టుల్లో నియమించాలి. అందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎప్పుడో గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

ఎప్పుడూ ఏదో ఒక సాకు...

ఉమ్మడి జిల్లాలో బొల్లాపల్లి, గురజాల, శావల్యాపురం, పిట్టలవాని పాలెం, ప్రత్తిపాడు, ఈపూరు, నూజెండ్ల,రాజుపాలెం, రొంపిచర్ల మండలాల్లో పూర్తి స్థాయి ఖాళీ లున్నాయి. అవికాక మరికొన్ని ఖాళీలు కూడా ఉన్న ట్లు తెలుస్తుంది. గత ఐదు నెలలుగా పదోన్నతికి అర్హత కలిగిన సీనియర్ అసిస్టెంట్‌లు జిల్లా పరిషత్ చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. అయినా సంబంధిత ఫైల్ ను సక్రమంగా రూపొందించాల్సిన ఏ సెక్షన్ అధికారులు ఏదో ఒక పొరపాటు చేయటం దానిమీద అధికారులు చర్చించాలి(డిస్కషన్)అని రాయడం పరిపాటిగా మారింది.

ప్యానల్ లేకుండా జాబితా తయారు...

వాస్తవానికి ప్రమోషన్ ప్రక్రియ కు ముందు అర్హులైన వారితో ప్యానల్ రూపొందించాలి. జిల్లా పరిషత్ అధికారులు తాజాగా రూపొందించిన జాబితా వివాదాస్పదం కావటానికి అదే కారణం గా కనిపిస్తుంది. కనీసం 30 మంది తో ప్యానల్ రూపొందించి అందులో అర్హులైన వారికి ప్రమోషన్‌లు

(మిగతా 6లో..)

అమృత్ 2.0..

పురాల పౌరుల తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత్ 2.0 పథకం అమలకు ఆమోదం లభించింది. రాష్ట్ర సచివాలయంలో సీఎం నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన శుక్రవారం జరిగిన మంత్రిమండలి సమావేశంలో అమృత్ పనులపై చర్చించారు. పనులు చేపట్టేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. దీంతో పనులు చేపట్టేందుకు మార్గం సుగమం అయింది. రూ 1,136కోట్ల వ్యయంతో పనులు చేపట్టనున్నారు. ఈ మేరకు టెండర్లు నిర్వహించేందుకు పబ్లిక్‌హెల్త్ శాఖ సమాయత్తమవుతోంది.

- రూ 1,136 కోట్ల వ్యయంతో 86 పనులు
- టెండర్లు నిర్వహించేందుకు పబ్లిక్ హెల్త్ శాఖ ఏర్పాట్లు



అమృత్ పథకంలో ప్రతిపాదించిన నరసరావుపేటలోని కత్తవ చెరువు

(తెనాలి, ఆంధ్రజ్యోతి)

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని, మున్సిపాలిటీలు, గుంటూరు కార్పొరేషన్ సహా అమృత్ పథకం కింద నీటి పథకాల విస్తరణ, చెరువుల అధునికీకరణ, మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. ఇందులో భాగంగా పురపాలక సంఘాల్లో తాగు నీటి పథకాలను రానున్న 25 ఏళ్లలో పెరిగే జనాభాకు అనుగుణంగా విస్తరించడం. నీటి నిల్వ చెరువులు అభివృద్ధి. పైపులైన్లు ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం. 24/7 నీటిని సరఫరా చేసే దిశగా నీటి పథకాలను అభివృద్ధి. మురుగునీటి సమస్యలపై దృష్టి సారించడం. మురుగు నీటి శుద్ధి ప్లాంట్‌ల నిర్మాణం. పట్టణాల్లో భూగర్భ జలాలను పెంపొందించేందుకు చెరువులను అభివృద్ధి చేయడం. చెరువుల్లో పూడిక తీత, కట్టలు పటిష్టం, వీటిపై వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణం. పట్టణాల్లో వైసీపీ ప్రభుత్వం హయాంలో ఏర్పాటు చేసిన సెంటు స్థలం కాలనీలకు తాగు నీటి సరఫరా. అయా కాలనీలకు పైపు లైన్లు, ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, గృహాలకు కుళాయి కనెక్షన్‌లు ఇవ్వడం. అయా పనులు అమృత్ పథకం కింద చేపట్టనున్నారు. అయా పనులు పూర్తి చేస్తే పురాల్లో తాగు, మురుగు నీటి కష్టాలు తీరుతాయి. దీనికి గాను 1092.40 కోట్ల వ్యయంతో గతంలో టెండర్లు నిర్వహించగా ఎస్ఓఆర్ రేట్లు పెరగడంతో టెండరును నిలిపివేశారు. దీంతో ప్రామాణిక రేట్లు(ఎస్ఓఆర్) పెరగడంతో 86 పనుల వ్యయం రూ.1,136కోట్లకు పెరిగింది. పెరిగిన రేట్లకు అనుమతికి సంబంధించిన ఫైల్ మునిసిపల్ పరిపాలన విభాగం వద్ద గత మూడు నెలలుగా పెండింగ్‌లో ఉంది. ప్రస్తుతం మంత్రి మండలి ఆమోదంతో ఫైలు కదిలింది. ఆయా అధికారులు టెండర్ల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

తొలిసారిగా చామ్ విధానంలో పనులు

రాష్ట్రంలోనే తొలిసారిగా అమృత్ పథకం 2.0 కింద చేపట్టే ప్రగతి పనులను నూతన విధానంలో చేపనున్నారు. రాయితీ హైబ్రీడ్ యాన్యుటీ మోడల్(చామ్) కింద పనులు చేపట్టేందుకు మంత్రివర్గం ఆమోదించింది. ఇప్పటి వరకు జాతీయ రహదారుల నిర్మాణంలో వినియోగించిన పీపీపీ తరహాలోనే చామ్ విధానం కూడా ఉంది. 50శాతం నిధులు ప్రభుత్వం ఇస్తోంది. 50శాతం నిధులు కాంట్రాక్టర్ భరించాలి. సదరు సంస్థ ఖర్చు చేసే 50 శాతం నిధులను వడ్డీతో కలిపి 40 వాయిదాల్లో ప్రభుత్వం చెల్లిస్తుంది. ఈ విధానంలోనే గతంలో కూడా టెండర్లు నిర్వహించగా అవగాహన లేమితో కాంట్రాక్టర్లు టెండర్ దాఖలు చేసేందుకు ముందుకు రాకపోవడంతో టెండర్‌ను వాయిదా వేశారు. కాంట్రాక్టర్లకు పబ్లిక్ హెల్త్ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. దీంతో ప్రముఖ నిర్మాణ రంగ సంస్థ ప్రతిపాదించిన పనులు స్వయంగా క్షేత్ర స్థాయిలో పరిశీలించింది. సదరు సంస్థ టెండరు దాఖలు చేసేందుకు సమాయత్తమవుతున్నట్లు సమాచారం.

- బీబీనగర్ యార్డు - బొమ్మాయిపల్లి మధ్యన ఏర్పాటు
- టెండర్ ప్రక్రియ ప్రారంభించిన రైల్వే శాఖ
- రూ. 83.52 కోట్లు వెచ్చించి నిర్మాణం
- ఉపరితల క్రాసింగ్ సమస్య నివారించడమే లక్ష్యం

పగిడిపల్లి వద్ద.. ఆర్‌వోఆర్

గుంటూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ వైపు నుంచి గుంటూరు వైపునకు వచ్చే రైళ్లు పగిడిపల్లి వద్ద తలెత్తుతోన్న ఉపరితల క్రాసింగ్ సమస్యకు పరిష్కారంగా రైల్ ఓవర్ రైలు(ఆర్‌వోఆర్) నిర్మాణానికి దక్షిణ మధ్య రైల్వే ఉపక్రమించింది. ఇప్పటికే అన్ని అనుమతులు తీసుకొన్న రైల్వే శాఖ తాజాగా టెండర్ నోటీసుని విడుదల చేసింది. గరిష్టంగా రెండేళ్ల కాలవ్యవధిని నిర్మించి ఈ ప్రాజెక్టుని పూర్తి చేయాలన్న షరతుని కూడా పొందుపరిచింది. ఈ పనులు పూర్తి అయితే పగిడిపల్లి ఛేంజ్‌వోవర్ వద్ద ఎలాంటి నిలుపుదల, వేగ నిరోధకాలు లేకుండానే రైళ్లు గుంటూరు డివిజన్ వైపునకు కూత పెడతాయి. దీని వలన సమయపాలన కూడా పెరుగుతుందని రైల్వే అధికారవర్గాలు చెబుతున్నాయి.

గుంటూరు రైల్వే డివిజన్ పరిధి నడికుడి మార్గంలో ప్రస్తుతం పగిడిపల్లి(తెలంగాణ) వరకు కలిగివున్నది. సికింద్రాబాద్ నుంచి వచ్చే రైళ్లు ఇక్కడ కాజీపేట మార్గం నుంచి ఉపరితల క్రాసింగ్ అయి గుంటూరు డివిజన్‌లోకి ప్రవేశించాలి. ఒకవేళ కాజీపేట వైపు నుంచి సికింద్రాబాద్‌కు అదే సమయంలో ఏదైనా రైలు వస్తే గుంటూరు డివిజన్‌లోకి రావాల్సిన రైలుని పగిడిపల్లి వద్ద నిలిపేస్తున్నారు. కాజీపేట వైపు నుంచి వచ్చే రైలు ఇక్కడ దాటుకొని వెళ్లిన తర్వాతనే గుంటూరు డివిజన్‌లోకి రైలు రావడానికి క్లియరెన్స్ ఇస్తున్నారు. అలానే ఉపరితల క్రాసింగ్ కావడానికి వేగాన్ని కూడా 30 కిలోమీటర్లకు తగ్గిస్తున్నారు. దీని వలన ఇక్కడ సమయపాలన దెబ్బతింటున్నది.

ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా బొమ్మాయిపల్లి వద్ద నుంచి బీబీనగర్ యార్డు వరకు ఆర్‌వోఆర్ నిర్మాణాన్ని రైల్వే శాఖ ప్రతిపాదించింది. ఇందుకోసం రూ. 83.52 కోట్లతో అంచనాలను రూపొందించి రైల్వేబోర్డుకు నివేదించి ఆమోదం పొందింది. దీని వలన బీబీనగర్ వద్దనే గుంటూరు వైపునకు వచ్చే రైలు ఆర్‌వోఆర్ మీదగా ప్రయాణించి బొమ్మాయిపల్లి వద్ద కిందికి దిగిపోతుంది. ఈ కారణంగా ఉపరితల క్రాసింగ్ సమస్య అనేదే ఉత్పన్నం కాదు. అలానే వేగం తగ్గించాల్సిన అవసరం ఉండదు. ఈ నెల 23వ తేదీ వరకు టెండర్లు స్వీకరించి ఆ తర్వాత ఏజెన్సీని ఖరారు చేస్తారు. రెండేళ్లలోనే ఈ ప్రాజెక్టుని పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని రైల్వే శాఖ నిర్ణయించింది.



పగిడిపల్లి వద్ద ఉపరితల క్రాసింగ్ సమస్యలు తలెత్తుతున్న ప్రదేశం

సొసైటీ బ్యాంకుల్లో భోక్తలను వదిలేది లేదు

- డీసీసీబీ చైర్మన్ మక్కెన



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు తదితరులు

గుంటూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల్లో అక్రమంగా రుణాలు పొందిన భోక్తలు ఎంతటి వారైనా.. వదిలేది లేదని మాజీ ఎమ్మెల్యే, బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు హెచ్చరించారు. స్థానిక బ్రాడీపేటలో నున్న ఎన్‌టీఆర్ సహకార భవన్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో కోట్లాది రూపాయల కుంభకోణం జరిగిందన్నారు. దీనిపై ఇప్పటికే విచారణ జరిగిందని, నివేదికలు వచ్చాక చర్యలుంటాయని పునరుద్ఘాటించారు. గురజాలలో కోల్డ్ స్టోరేజ్ యజమానితో అక్రమార్కులు కుమ్మక్కై రూ.12 కోట్లు కుంభకోణం చేశారని, ఇందులో కొందరు అధికారుల పాత్ర కూడా ఉన్నట్లు

(మిగతా 6లో..)

మంగళగిరి - కృష్ణ కెనాల్ స్టేషన్ల మధ్య..

6 వరసల ఆర్‌వోబీ

- ఎన్‌హెచ్ - అమరావతి రాజధాని వయా ఈ-13
- రైల్వే మంత్రిత్వ శాఖ ఆమోదం

గుంటూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి - కృష్ణ కెనాల్ రైల్వేస్టేషన్ల మధ్య అమరావతి రాజధానికి సంబంధించి ఈ-13 ఎక్స్‌టెన్షన్ రోడ్డు వద్ద ఆరు వరసల ఆర్‌వోబీని రైల్వే మంత్రిత్వ శాఖ మంజూరు చేసింది. ఇందుకోసం రూ. 112 కోట్ల అంచనా వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. ప్రతిపాదిత ఆర్‌వోబీ అమరావతి రాజధాని, జాతీయ రహదారి(ఎన్‌హెచ్)-16 మధ్య అనుసంధాన రహదారిపై ఉంది. ఈ రోడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం100 శాతం రైల్వే వ్యయంతో జరుగుతుంది. ఈ-13 స్థానం కీలకమైన ప్రదేశంలో ఉండి ఎన్‌హెచ్-16ను అమరావతి రాజధానితో కలుపుతుంది. అలానే మధ్యలో ఒక వైపు రైల్వే ట్రాక్ ఉంది. ఈ రైల్వే ట్రాక్ చెన్నై - హౌరాను విజయవాడ మీదుగా కలిపే ముఖ్యమైన రద్దీ రైల్వే లైన్. ప్రారంభంలో దీనిని నాలుగు లైన్ల రోడ్ ఓవర్ బ్రిడ్జి కోసం ప్రణాళిక చేశారు. అయితే స్థానం, భవిష్యత్తు ట్రాఫిక్ ప్రాముఖ్యతను పరిగణనలోకి తీసుకుని, ఆరు వరసల రోడ్ ఓవర్ బ్రిడ్జీని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించగా రైల్వే మంత్రిత్వ శాఖ శుక్రవారం అంగీకారాన్ని తెలిపింది. టెండరింగ్ ప్రక్రియకు మారే ముందు డిజైన్ల ఆమోదం, సాధారణ డ్రాయింగ్‌లు వంటి ప్రాథమిక పనులు త్వరలో పూర్తవుతాయి. ప్రతిపాదిత రోడ్డు ఓవర్ బ్రిడ్జి ఆంధ్రప్రదేశ్ రాజధాని నగర ప్రాంతం వైపు వెళ్లే రోడ్డు ట్రాఫిక్ సజావుగా సాగడానికి ఎంతో సహాయపడుతుంది. ఇది రోడ్డు, రైలు వినియోగదారుల భద్రతను నిర్ధారిస్తూ నిలుపుదలలను నివారించి రవాణాను సజావుగా సులభతరం చేస్తుందని దక్షిణ మధ్య రైల్వే వర్గాలు తెలిపాయి.



పరీక్ష కేంద్రంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐజీ త్రిపాఠి, ఎస్పీ వకుల్ జిందాల్

ఏపీపీ రాత పరీక్షలకు పటిష్ట బందోబస్తు

- ఏర్పాట్లను పరిశీలించిన ఐజీ సర్వశేష్ఠ త్రిపాఠి

గుంటూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉద్యోగాలకు సంబంధించి శనివారం జరగనున్న రాత పరీక్షలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రేంజ్ ఐజీ సర్వశేష్ఠ త్రిపాఠి తెలిపారు. ఈ మేరకు గుంటూరు విజ్ఞాన్ నిరుల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ విద్యాలయంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని శుక్రవారం ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలసి పరిశీలించారు. ఈ పరీక్షలకు జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) రమణమూర్తి నోడల్ అధికారిగా వ్యవహరిసున్నారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ పరీక్షకేంద్రం వద్ద అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తు ఏర్పాట్లు చేయడానికి సౌత్ డీఎస్పీ, నల్లపాడు సీఐలను నియమించామన్నారు. ప్రినిపాల్ డాక్టర్ రాధిక పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను వివరించారు.

స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల్లో మెరిసిన గుంటూరు

- 5 రాష్ట్ర, 48 జిల్లా స్థాయి అవార్డులు
- ప్రకటించిన కలెక్టర్ అన్సారియా

గుంటూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాకు లభించిన స్వచ్ఛ ఆంధ్ర అవార్డులను కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ప్రకటించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో జరిగిన మీడియా ప్రతినిధుల సమావేశంలో అవార్డుల వివరాలను ఆమె వెల్లడించారు. జిల్లాకు 5 రాష్ట్ర, 48 జిల్లా స్థాయి అవార్డులు వచ్చాయన్నారు. వివరాలను స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర పోర్టల్ పొందుపరిచామని చెప్పారు. స్వచ్ఛ నగర, మండలాలు, గ్రామ పం చాయతీలు, పాఠశాలలు, ఆసుపత్రులు, కార్యాలయాలు, రైతు బజార్లు, బస్ స్టేషన్లు, పరిశ్రమలు మొదలైన వివిధ విభాగాల్లో అవార్డులకు ఎంపిక చేయడం జరిగిందన్నారు.

రాష్ట్రస్థాయి అవార్డులు:

స్వచ్ఛ మున్సిపాలిటీలలో గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ (స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డు ప్రత్యేక కేటగిరి), మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్(లక్ష నుంచి మూడు లక్ష ల జనాభా కేటగిరి), స్వచ్ఛ గ్రామ సంఘం కేటగిరిలో పొన్నూరు మం డలం ములుకుదురు గ్రామం, స్వచ్ఛ అంగన్వాడీ కేంద్రాల్లో జొన్నలగడ్డ మెయిన్ అంగన్వాడీ, స్వచ్ఛ రైతు బజార్ కేటగిరిలో చుట్టుగుంట రైతు బజార్‌కు రాష్ట్ర స్థాయి అవార్డులు దక్కాయని కలెక్టర్ తెలిపారు.

జిల్లాస్థాయి బహుమతులు

జిల్లాలో మొత్తం 48 ఉత్తమ స్వచ్ఛ అవార్డులను కలెక్టర్ ప్రకటించారు. అందులో స్వచ్ఛ మున్సిపాలిటీగా పొన్నూరు అవార్డు దక్కించుకుంది. ఇక ఉత్తమ స్వచ్ఛత వారియర్స్ (పారిశుద్ధ్య కార్మికులు), అంగన్‌వాడీలు, ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమలు, ఆసుపత్రులు, పాఠశాలలు, పంచాయతీలు, గ్రామ సంఘాల్లో స్వచ్ఛత పాటించిన వాటిని అవార్డులకు ఎంపిక చేశారని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, కమిషనర్ పులి శ్రీనివాసులు, డీఆర్వో ఎన్ఎస్‌కే ఖాజా వలి, డీపీఓ బీవీ నాగ సాయి కుమార్ పాల్గొన్నారు.



స్వచ్ఛ ఆంధ్ర అవార్డులను ప్రకటిస్తున్న కలెక్టర్ అన్సారియా

సమాజాభివృద్ధిలో.. యువ నిపుణులదే కీలక పాత్ర

గుంటూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): సమాజానికి ప్రగతి పథంలో నడిపించడంలో యువ నిపుణులదే కీలక పాత్ర అని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, యంగ్ ప్రొఫెషనల్స్‌తో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజ్ఞానం వృథా కాకుండా సమాజ హితానికి దోహదం కావాలని ఆకాంక్షించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో నియోజకవర్గ స్థాయిలో కార్యాలయాలను ముఖ్యమంత్రి ఏర్పాటు చేశారన్నారు. ఈ వ్యవస్థను విజయవంతం చేయడంలో ధృడ సంకల్పంతో పని చేయాలని కోరారు. నియోజకవర్గాల స్థాయిలో విజన్ యాక్షన్‌ప్లాన్ తయారు చేయడం జరిగిందని, దానిపై క్షుణ్ణంగా అవగాహన పొందాలని సూచించారు. ప్రాథమిక, సెకండరీ, సేవా రంగాల్లో ఉన్న అన్ని అవకాశాలు ఉపయోగించుకొని నియోజకవర్గం అభివృద్ధిలో ప్రముఖ పాత్ర పోషించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ, ప్రజా సమస్యల పరిష్కార వేదిక తదితర కార్యక్రమాల అమలులో భాగస్వామ్యం కావాలని ఆదేశించారు. జడ్పీ ఈసీఓ జ్యోతి బసు, వ్యవసాయ శాఖ జేడీ అయితా నాగేశ్వరరావు, జీఎంసీ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు పాల్గొన్నారు.

ప్రొటీన్ అధికంగా ఉండే పన్నీర్ తయారీ : ధూళిపాళ్ల



సంగం డెయిరీలోని దుర్గా పూజలో ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ దంపతులు

చేబ్రోలు, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): ప్రొటీన్ అధికంగా ఉన్న పన్నీరును తయారు చేసి.. విడుదల చేస్తున్నట్లు సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తెలిపారు. గురువారం వడ్లమూడి సంగం డెయిరీలో ఆయుధపూజ కార్యక్రమంలో చైర్మన్ నరేంద్ర కుమార్, జ్యోతిర్మయి దంపతులు పాల్గొన్నారు. అనంతరం సంగం డెయిరీలో రూపొందించిన ప్రోటీన్ అధికంగా ఉండే పన్నీర్‌ను మార్కెట్లోకి విడుదల చేశారు. అత్యాధునిక సాంకేతికత గల మల్టీ వ్యాక్ ప్యాకేజింగ్‌లో ఈ పన్నీర్ ఎక్కువ కాలం నిల్వ ఉంటుందని తెలిపారు. అన్ని ప్రాంతాలకు సరఫరా చేయడం ద్వారా అందరికీ స్వచ్ఛమైన సురక్షితమైన పన్నీర్‌ను వినియోగదారులకు అందించే వెసులుబాటు ఉందన్నారు. 200 గ్రాముల, 500 గ్రాములు, కేజీ ప్యాకింగ్‌లో వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు వివరించారు. డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ పి గోపాలకృష్ణ, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పెదవడ్లపూడి బాబాను దర్శించుకున్న పీవీ సింధు



పీవీ సింధుకు జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

మంగళగిరి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు కుటుం బ సభ్యులతో కలిసి పెదవడ్లపూడిలోని భగవాన్ శ్రీ సత్య షిర్డి సాయిబాబా మందిరాన్ని దర్శిం చారు. సింధు, ఆమె భర్త దత్తసాయి, తండ్రి పీవీ రమణలకు మం దిర కమిటీ చైర్మన్ పాతూరి నాగభూషణం, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. బాబా వారికి ప్రత్యేక పూజల అనంతరం గోమాత-గోశాలను సందర్శించి గోవులకు ఆహారం అందించారు. సింధు దంపతులను నాగభూషణం శాలువాతో సత్కరించి, బాబా వారి చిత్రపటం బహూకరించారు. అనంతరం పీవీ సింధు మాట్లాడుతూ సాయిబాబాను దర్శించుకోవడంతోపాటు గోసేవలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. గోశాల కన్వీనర్ పాతూరి శ్రీనివాసరావు, యలమంచిలి జగదీశ్‌బాబు, అన్నే శరత్, చర్లపల్లి కిరణ్, ఏళ్ల కిరణ్, ముసునూరు ప్రసాద్, జవ్వాది అమ్మయ్య చౌదరి, సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రకాశం బ్యారేజి వద్ద తగ్గుతున్న వరద ఉధృతి

తాడేపల్లి టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 2,16,083 క్యూసెక్కుల వరద నీరు శుక్రవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్లు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా దిగువకు 1,98 825 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాలువకు 9337, పశ్చిమ డెల్టాకు 7921 క్యూసెక్కులు వదులుతుండగా, గుంటూరు చానల్ కాలువకు నీటి విడుదల నిలిపివేశారు.

జీఎస్టీ తగ్గింపుతో చౌకగా చేనేత వస్త్రాలు



చేనేత వస్త్రాల పరిశీలనలో రీజనల్ డైరెక్టర్ భీమయ్య

గుంటూరు సిటీ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0లో వస్త్రాలపై పన్నులు తగ్గడంతో.. చేనేత వస్త్రాలు వినియోగదారులకు తక్కువ ధరకే లభ్యమవుతున్నాయని చేనేత, జౌళి శాఖ ప్రాంతీయ ఉపసంచాలకులు వి.భీమయ్య తెలిపారు. శుక్రవారం లక్ష్మీపురంలోని ఆప్కో దుకాణంలో జీఎస్టీ 2.0 వేడుకలు, సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించారు. వస్త్రాలపై పన్ను తగ్గింపు ప్రయోజనాలను చేనేత, జౌళీ, జీఎస్టీ (సేల్స్ టాక్స్), పరిశ్రమల శాఖ, ఖాదీ గ్రామీణ పరిశ్రమల శాఖల ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. వివిధ రకాల వస్త్రాలపై తగ్గిన పన్నుల వివరాలతో దుకాణం వద్ద ప్రచార పోస్టర్లను ప్రదర్శించారు. రీజినల్ డైరెక్టర్ వి భీమయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు.. తగ్గిన పన్నులపై ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించేలా.. ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. జీఎస్టీ తగ్గింపు వల్ల చిన్న వ్యాపారులు, చేనేత ఉత్పత్తిదారులకు పన్ను భారం తగ్గుతుందని, చేనేత వస్త్రాలు చౌకగా లభిస్తాయన్నారు. జీఎస్టీ (రాష్ట్ర పన్నులు) అసిస్టెంట్ కమిషనర్ కేదార స్వామి మాట్లాడుతూ దేశంలో 2017 జూలైలో జీఎస్టీ పన్ను 395 వస్తువులపై 5, 12, 18, 28 శాతాలుగా నాలుగు స్లాబ్ రేట్లలో అమలు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం జీఎస్టీ 2.0 లో తీసుకువచ్చిన నూతన సంస్కరణల ప్రకారం వివిధ రకాల వస్తువులపై కొన్నింటికి పూర్తిస్థాయిలో పన్ను తొలగించడంతోపాటు 6 శాతం, 12 శాతం రెండు స్లాబు రేట్లు మాత్రమే అమలు చేయడం జరిగిందన్నారు. పరిశ్రమల శాఖ ఏడీ మణికుమారి, ఖాదీ గ్రామీణ పరిశ్రమల శాఖ ఏడీ షేక్ అబ్దుల్ రషీద్, జీఎస్టీ అధికారి నల్లపాటి శ్రీనివాసరావు, పరిశ్రమ శాఖ సూపరింటెండెంట్ నాగరాణి, చేనేత , జౌళి శాఖ అభివృద్ధి అధికారులు బి శ్రీధర్ బాబు, కే రాజ వర్ధన్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పరిశీలనలో విదేశీయుల బృందం



విదేశీయుల బృందంలోని సభ్యులు

గుంటూరు సిటీ, అక్టోబర్ 3(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం పట్ల ప్రత్యక్ష అనుభవం పొందేందుకు బ్రెజిల్, యూఏఈ, శ్రీలంక దేశాలకు చెందిన 30 మంది సభ్యుల ప్రతినిధుల బృందం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎనిమిది రోజులపాటు సందర్శించనుంది. ఈ పర్యటన రైతు సాధికార సంస్థ, అంతర్జాతీయ గుర్తింపు పొందిన "నౌ" (ఎన్ ఓ డబ్ల్యు) పార్ట్నర్స్ ద్వారా నిర్వహించబడుతుంది. శుక్రవారం గుంటూరులోని ఓ ప్రైవేట్ హోటల్‌లో సమావేశం నిర్వహించారు. శనివారం నుంచి వారం రోజుల పాటు జరుగనున్న క్షేత్రస్థాయి సందర్శనలను దృష్టిలో ఉంచుకొని రైతు సాధికార సంస్థ సీనియర్ అధికారులు వారికి తగిన సమాచారాన్ని పవర్ పాయింట్ ద్వారా అందించారు. ఈరోజు ప్రతినిధుల బృందాన్ని ఆర్.వై.ఎస్.ఎస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.రామారావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నీరజ స్వాగతించారు. అనంతరం ఆర్.వై.ఎస్.ఎస్ విజన్, మిషన్, నిర్మాణాన్ని పరిచయం చేశారు. అనంతరం వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రకృతి వ్యవసాయ విస్తరణకు సహకరిస్తున్న "నౌ" పార్ట్నర్స్ ఫౌండేషన్, నౌ ఇన్వెస్ట్‌మెంట్ పార్ట్నర్స్ వ్యవస్థాపకులు, చైర్మన్ వాల్టర్ లింక్, బ్రెజిల్ డైరెక్టర్ లియోనార్డో అండ్రాడేల నేతృత్వంలో ఈ పర్యటన కొనసాగుతోంది. ఐ క్రాఫ్ శ్రీలంక దేశ డైరెక్టర్, యూఏఈకి చెందిన న్యూయార్క్ యూనివర్సిటీ నేత కూడా ఈ బృందంలో పాల్గొన్నారు. బృందంలో ప్రపంచ స్థాయిలో సుస్థిర అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే నాయకులు, బ్రెజిల్ వ్యవసాయ, కుటుంబ వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు, ప్రభావవంతమైన సహకార సంఘాలు, ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులు, ప్రధాన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సివిల్ సొసైటీ సంస్థల నేతలు ఉన్నారు.

19న బీసీఈఎఫ్ రాష్ట్ర ద్వితీయ మహాసభ

● బీసీ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివ పూర్ణయ్య



ప్రసంగీస్తున్న శివ పూర్ణయ్య

గుంటూరు కార్పొరేషన్, అక్టోబర్3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో పెన్షనర్ హోమ్‌లో ఈ నెల 19న రాష్ట్ర బీసీ ఉద్యోగుల ఫెడరేషన్ ద్వితీయ మహా సభ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర బీసీ ఉద్యోగుల ఫెడరేషన్ అధ్యక్షుడు గుంటుపల్లి శివ పూర్ణయ్య తెలిపారు. శుక్రవారం గుంటూరు పెన్షనర్ హోమ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..సభను విజయవంతం చేసేందుకు ఆదివారం సాయంత్రం రాష్ట్ర , జిల్లా, నగర కార్యవర్గ సభ్యులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర మహాసభలో పదోన్నతులలో బీసీ ఉద్యోగులకు మెరిట్ కం రోస్టర్ విధానాన్ని అమలుపై చర్చ జరుగుతుందన్నారు. తదుపరి రాష్ట్ర కమిటీ ఎన్నిక నిర్వహించబడుతుందని శివ పూర్ణయ్య పేర్కొన్నారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వీవీ రమణయ్య, వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.వి ప్రసాద్, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె. నరసింహారావు, సలహా మండల చైర్మన్ సత్యనారాయణ, జిల్లా అధ్యక్షులు ఎం సుబ్బారావు, నగర అధ్యక్షులు శ్రీనివాసరావు, అప్పలరాజు పాల్గొన్నారు.

రూ.30 లక్షల విలువైన పురుగు మందులు స్వాధీనం

పిడుగురాళ్ళ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): బిల్లులు లేకుండా కార్గో పార్శిల్ సర్వీస్ ద్వారా సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్న పురుగు మందుల బాక్స్‌లను సంబంధిత కార్టేవా కంపెనీ ప్రతినిధులు శుక్రవారం గుర్తించారు. తెలంగాణ రాష్ట్రంలోని నిజామాబాద్ నుంచి పిడుగురాళ్ల బస్టాండ్ పక్కనే ఉన్న పార్శిల్ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్‌లోని కార్గో పార్శిల్ ద్వారా గురజాల ప్రాంతానికి తరలిస్తుండగా కార్టేవా పురుగు మందుల కంపెనీ డిస్ట్రిబ్యూటర్లు గుర్తించారు. సుమారు 6 బాక్స్‌లను స్వాధీనం చేసుకొని స్థానిక వ్యవసాయ అధికారులకు అప్పగించారు. వరిలో పిడిదోమ నివారణకు పెక్స్‌లాన్ అనే పురుగు మందును ఉపయోగిస్తారు. నిజామాబాద్ నుంచి పిడుగురాళ్లకు చేరిన పురుగు మందుల బాక్స్‌లు ఇక్కడి నుంచి గురజాల ప్రాంతానికి గుర్తుతెలియని నలుగురు పేర్లతో పార్శిల్ చేసేందుకు సిద్ధంగా ఉంచారు. స్వాధీనం చేసుకున్న పురుగు మందుల విలు సుమారు రూ.30 లక్షలు ఉంటుందని సమాచారం. పురుగు మందు అసలో..నకిలీనో.. అధికారులు తేల్చాల్సి ఉంది.

ఆడుకునేందుకు వెళ్లి..
శవమై తేలిన బాలుడు



మృతిచెందిన అశిక్ రెహమాన్

తెనాలి క్రైం, అక్టోబరు3 (ఆంధ్రజ్యోతి) : ఆడుకునేందుకు వెళ్లిన ఐదేళ్ల బాలుడు శవమై కాలువలో తేలిన ఘటన తెనాలి త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బాలాజీరావుపేటలో నసీమ తన ఐదేళ్ల అశిక్ రెహమాన్‌తో కలిసి జీవిస్తోంది. భర్త లేకపోవడంతో ఆ లోటు కుమారిడికి తెలియకుండా అల్లారు ముద్దుగా పెంచుతోంది. బుధవారం సాయంత్రం బాలుడు అశిక్ రెహమాన్ పిల్లలతో కలిసి బంతాట ఆడుకోవడానికి వెళ్లాడు. సాయంత్రమైనా బాలుడు ఇంటికి రాకపోయే సరికి తల్లి నసీమ పరిసర ప్రాంతాల్లో వెతికింది. ఆచూకి లభించకపోవడంతో త్రీటౌన్ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు, బంధువులు కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం ఉదయం బాలుడు ఆడుకుంటున్న ప్రాంతం సమీపంలో ఉన్న పడమర కాలువలో బంతి తేలియాడుతూ కనిపించింది. అనుమానం వచ్చిన పోలీసులు కాల్వను అనుసరించారు. అక్కడే శవమై బాలుడు నీటిపై తేలియాడుతూ కనిపించాడు. దీంతో తల్లి నసీమ విగతజీవిగా ఉన్న బిడ్డను చూసి గుండెలో బాధుకుంటూ రోదిస్తున్న తీరుతో ఆ ప్రాంతమంతా విషాద చాయలు అలుముకున్నాయి. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

300 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

పొన్నూరుటౌన్, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న 300 బస్తాల రేషన్ బియ్యం లారీని పొన్నూరు అర్బన్ పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. అర్బన్ సీఐ వీరానాయక్ కథనం ప్రకారం.. గురువారం తెల్లవారుజామున 2 గంటలకు విశ్వసనీయ సమాచారం ప్రకారం అర్బన్ పోలీసులు సోదాలు నిర్వహించారు. పొన్నూరు పట్టణంలోని ఐలాండ్ సెంటర్ నుంచి గుంటూరు వైపు వెళుతున్న కంటైనర్ వాహనాన్ని తనిఖీ చేశారు. గణపవరం గ్రామానికి చెందిన తాళ్లూరి మహేష్ అనే వక్తి పారిపోయేందుకు యత్నించగా.. అదుపులోకి తీసుకొన్నారు. కంటైనర్‌లో 150 క్వింటాళ్ల రేషన్ బియ్యం గుర్తించారు. లారీపై పాల ఉత్పత్తులు అని రాసి సరఫరా సాగించడం పోలీసులు గుర్తించారు. బియ్యం భట్టిప్రోలు గ్రామానికి చెందిన శ్రీనివాసరావు అనే వ్యక్తి అందజేయగా కంటైనర్ ఓనర్ అయిన కిషోర్ వద్దకు తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. భట్టిప్రోలు గ్రామంలో శ్రీనివాసరావుకు చెందిన గోడౌన్‌లో నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యంను లారీలో లోడ్ చేసుకొని వస్తుంగా మార్గంలో మధ్యలో పొన్నూరులో పట్టుబడినట్లు లారీ డ్రైవర్ మహేష్ విచారణలో వెల్లడించారు. కంటైనర్‌ను సీజ్ చేశారు.

రైల్వే డివిజన్‌లో వెయ్యి ఖాళీ ప్రదేశాల అభివృద్ధి



గాంధీ జయంతి కార్యక్రమంలో డీఆర్ఎం

గుంటూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా 15 రోజుల్లో గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని వెయ్యి ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా మార్చినట్లు డీఆర్ఎం సుధేష్ణ సేన్ తెలిపారు. గురు, శుక్రవారాల్లో గుంటూరు రైల్వేస్టేషన్, మెడికల్ కళాశాల రోడ్డులోని రైల్వే క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రైల్వే క్వార్టర్స్‌లోని ఖాళీ స్థలాన్ని శుభ్రం చేసి.. రైల్వే స్క్రాప్‌ని వినియోగించి పిల్లల పార్కుగా అభివృద్ధి చేశారు. ఇందుకోసం కృషి చేసిన రైల్వే అధికారులను డీఆర్ఎం అభినందించారు. ఆ ఆట స్థలానికి సృజనవనంగా పేరు పెడుతున్నట్లు ప్రకటించారు. గాంధీ జయంతి రోజున గుంటూరు రైల్వేస్టేషన్‌లో తూర్పు వైపున క్లాత్ వెండింగ్ మెషీన్ ప్రారంభోత్సవం, నుక్కడ్ నాటకం, నృత్య పోటీలు జరిగాయి. ఏడీఆర్ఎం రమేష్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

9 మంది గంజాయి విక్రేతల అరెస్టు

● రూ.10 లక్షల విలువైన గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సత్తెనపల్లి డీఎస్పీ ఎం.హనుమంతరావు

నకరికల్లు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): నకరికల్లు పోలీసులు చల్లగుండ్లలో అక్రమంగా గంజాయి రవాణా, విక్రయం చేస్తున్న 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 10 కిలోల గంజాయిని, రూ.5 వేల నగదు, సెల్‌ఫోన్లను, స్కూటీని, గంజాయి తూకం మిషన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సత్తెనపల్లి డీఎస్పీ ఎం.హనుమంతరావు శుక్రవారం నకరికల్లు పోలీస్ స్టేషన్‌లో నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టారు. మరో 8 మందిని ఈ కేసులో అరెస్టు చేయాల్సి ఉందని వారిని త్వరలోనే అరెస్టు చేస్తామని డీఎస్పీ వెల్లడించారు. చల్లగుండ్లలో అక్రమ రవాణా సమాచారంతో సత్తెనపల్లి రూరల్ సీఐ పి.కిరణ్, నకరికల్లు ఎస్ఐ కె.సతీష్ తమ పోలీసు సిబ్బందితో పెట్రోలు బంకు వద్ద అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను గుర్తించి విచారించగా.. ఈ గంజాయి కేసు వెలుగు చూసినట్లు తెలిపారు. రాజుపాలెం మండలం గణపవరం గ్రామానికి చెందిన నర్రా హనుమంతరావు గంజాయిని కొనుగోలు చేసి చిన్న ప్యాకెట్లలో ఇక్కడ విక్రయిస్తున్నట్లు తెలిపారు. విశాఖపట్నం తాళిపేటకు చెందిన పెంటకోట శంకరరావు ఒడిశా నుంచి గంజాయి తీసుకొచ్చి సరఫరా చేస్తుంటాడని తెలిపారు. నకరికల్లుకు చెందిన కగ్గా శ్రీనివాసరావు, రాజుపాలెం మండలం పులిచింతల ఆర్ఆర్ ప్లాట్స్‌కు చెందిన కాపర్తి మల్లికార్జునరావు, బీహార్ రాష్ట్రానికి చెందిన అగయ్య వినోద్‌యాదవ్, నకరికల్లు మండలం చేజర్లకు చెందిన బాణావత్ బాలునాయక్ అలియాస్ వెంకటేశ్వర్లు, రాజుపాలెం మండలం చౌటపాపాయపాలేనికి చెందిన పాదుపాటి శ్రీనివాసరావు, ఆవుల పెద్దసాంబయ్య, కొండమోడుకు చెందిన బండారు హనుమంతరావుల వద్ద వున్న గంజాయిని, చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి ఇతర ప్రాంతాలకు వెళ్తున్నట్లు తెలిపారు. కృషి చేసిన డీఎస్పీ, సీఐ, ఎస్ఐలను ఎస్పీ బి.కృష్ణారావు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సైనికుడి మృతి

బాపట్లరూరల్, అక్టోబరు3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మాజీ సైనికుడు గంపాల వెంకటసుబ్బారెడ్డి గురువారం మృతి చెందాడు. కర్లపాలెం పంచాయతీ ఎం.వీరాజుపాలేనికి చెందిన ఆయన చందోలు ఎస్‌బీఐ బ్రాంచ్‌లో గార్డుగా ఉద్యోగం చేస్తున్నాడు. బైక్‌పై కర్లపాలెం నుంచి బాపట్లకు వస్తుండగా నందిరాజుతోట వద్ద జాతీయ రహదారిపై ఆటో ట్రాలీ అదుపు తప్పి ఢీకొట్టింది. దీంతో సుబ్బారెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. బాపట్ల రూరల్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ ఐఆర్ఎస్ అధికారి కారులో చోరీ

తెనాలి క్రైం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): తెనాలిలో తెలంగాణకు చెందిన ఐఆర్ఎస్ అధికారి కారులో భారీ చోరీ జరిగింది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని చెంచుపేటలో ఓ ఫంక్షన్ హాల్లో జరుగుతున్న వివాహ వేడుకలో పాల్గొనేందుకు తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఐఆర్ఎస్ అధికారి శ్రీరామ్ శాంతరాజు కారులో వచ్చారు. ఫంక్షన్ హాల్ సమీపంలో కారును నిలిపి డోర్లు లాక్ చేసుకుని లోలికి వెళ్లారు. వధువరులను ఆశీర్వదించిన అనంతరం తిరిగి కారువద్దకు వచ్చారు. కారు అద్దాలు ధ్వంసం చేసి అందులో ఉంచిన బ్యాగ్ ఎత్తుకెళ్లడాన్ని గుర్తించారు. చోరీకి గురైన బ్యాగ్‌లో పాస్‌పోర్ట్‌లు, క్రెడిట్ కార్డులు, రూ.5లక్షల నగదు, 100 గ్రాముల బంగారపు వస్తువులు, మూడు ఐ ఫోన్‌లు ఉన్నాయని బాధితుడు త్రీటౌన్‌పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఇంకా భూమ్మీద నూకలున్నాయి..



రైలు కిందకు పడిన వృద్ధురాలు

వేమూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : పట్టాల పక్కన నడుస్తున్న వృద్ధురాలిని రైలు ఢీకొన్నా.. తీవ్ర గాయాలతో బయటపడింది. రైలు కిందకెళ్లిన వృద్ధురాలిని గమనించి పైలెట్ వెంటనే రైలు ఆపారు. వృద్ధురాలిని ప్రయా ణికులు బయటకు తీసి..బోగీలో కూర్చోబెట్టారు. రైల్వే శాఖ సిబ్బంది ఆమెను చికిత్స నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటన శుక్రవారం ఉదయం మండలంలోని పెనుమర్రు రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. కొల్లూరు మండలం బొద్దులూరుపాడు గ్రామానికి చెందిన డెబ్భై ఐదేళ్ల డొక్కు కాళికమ్మ గ్రామ శివారులో పట్టాలు దాటుతుండగా.. తెనాలి నుంచి రేపల్లె వెళుతున్న రైలు ఢీకొంది. మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న కాళికమ్మ గురువారం రాత్రి తాడిగిరిపాడులో ఉండి ఉదయాన్నే సమీపంలోని రైల్వే ట్రాక్ పక్కనే నడుస్తుండగా ఈ సంఘటన జరిగినట్లు తెలుస్తోంది. క్షతగాత్రురాలి కుటుంబ సభ్యులకు అధికారులు సమాచారం చేరవేశారు.

ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులు

● కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కలెక్టర్

బాపట్ల, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులుగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోదక్‌కుమార్ పేర్కొన్నారు. బాపట్ల ఫార్మసీ కళాశాలలో డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు 8 రోజుల శిక్షణ తరగతులు శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. రాబోయే రెండు తరాల పిల్లలను మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయులుగా ముందు శిక్షణ తీసుకొని.. పిల్లలకు నాణ్యమైన విద్యనందించాలని చెప్పారు. సమాజంలో మార్పును ఉపాధ్యాయులు మాత్రమే తీసుకురాగలరన్నారు. రాబోయేరోజుల్లో ప్రభుత్వ కార్యక్రమాలలో ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలని కోరారు. బాపట్ల జిల్లాకు డీఎస్సీ ద్వారా 485 మంది ఉపాధ్యాయులు ఎంపికయ్యారన్నారు. సీఎం నారా చంద్రబాబునాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఉపాధ్యాయుల నియామకానికి శ్రద్ధ తీసుకున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ ఎస్.పురుషోత్తం, సమగ్రశిక్షాభియాన్‌ఏపీసీ నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఏపీ టెక్స్‌టైల్స్ మిల్స్ అసోసియేషన్..
నూతన కమిటీ బాధ్యతల స్వీకరణ



మాట్లాడుతున్న సామినేని కోటేశ్వరరావు, పాల్గొన్న నూతన కమిటీ సభ్యులు

గుంటూరు(తూర్పు), అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ టెక్స్‌టైల్స్ మిల్స్ అసోసియేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం గుంటూరు లక్ష్మీపురంలో అసోసియేషన్ కార్యాలయంలో జరిగింది. నూతన అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ అమెరికా సుంకాలతో టెక్స్‌టైల్స్ పరిశ్రమ తీవ్రంగా నష్టపోతుందన్నారు. మరోవైపు సబ్సిడీలు విడుదల చేయకపోవడంతో కఠినమైన ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నామని తెలిపారు. ప్రభుత్వం వాగ్దానం చేసిన విధంగా రూ.900 కోట్ల సబ్సిడీని దశల వారీగా గాకుండా ఏక మొత్తంగా విడుదల చేయాలన్నారు. విద్యుత్ బిల్లుపై యూనిట్‌కు రూ.2 రాయితీ అందించాలన్నారు. యూనిట్‌కు రూపాయి పెంచాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వాయిదా వేయాలని కోరారు. త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కలిసి సమస్యలను వివరిస్తామని తెలిపారు. అధ్యక్షుడిగా సామినేని కోటేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు పి.కోటీరావు, గౌరవ సలహాదారు రఘురామిరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎంవీ సత్యనారాయణ, రమేష్‌రాజు, బొర్రా ఉమామహేశ్వరరావు, చలపతిరావు, 12 మంది డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	128, 137, 148
చికెన్ విత్ స్కిన్(కిలో)	240.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	250.00

9,599 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దసరా సెలవుల నేపథ్యంలో శుక్రవారం మిర్చి యార్డుకు కేవలం 9,005 మిర్చి టిక్కీలు విక్రయానికి వచ్చాయి. ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 9,599 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు. యార్డు ఆవరణలో 4,121 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10500	14200
నెంబరు. 5	10000	14000
273	--	---
341	10000	14800
4884	----	----
సూపర్ 10	----	---
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14800
షార్క్-1	-----	----
బ్యాడిగి	10000	14800
దేవనూరు డీలక్స్	10000	15000

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఆర్మూరు	9800	12000
ఏసీ కామన్ వెరైటీ		
334	10500	14400
నెంబరు. 5	10000	14000
273	----	----
341	10000	14800
4884	---	---
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14700
బ్యాడిగి	10000	15000
దేవనూరు డీలక్స్	---	---
తాలుకాయలు	5000	7000

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయండి

● మంత్రి లోకేశ్‌కు ఎమ్మెల్యే గళ్లా మాధవి వినతి

గుంటూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలని మంత్రి నారా లోకేశ్‌ను ఎమ్మెల్యే గళ్లా మాధవి కోరారు. విద్యా శాఖా మంత్రి లోకేశ్‌తో శుక్రవారం ఆమె ప్రత్యేకంగా భేటీ అయి తాజా రాజకీయ అంశాలు, నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలుపై వినతి పత్రాలను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 2018లో అనుమతి పొందిన బీసీ భవన్ నిర్మాణ పనులు వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నిలిచిపోయాయని, వెంటనే నిధులు విడుదల చేసి ఈ భవనాన్ని పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. 2016లో రూ.903 కోట్ల అంచనాతో ప్రారంభమైన భూగర్భ డ్రైనేజీ ప్రాజెక్టు ఇంకా పూర్తికాకపోవడం వల్ల నగర ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మంత్రి నారా లోకేశ్ సానుకూలంగా స్పందించి, తప్పనిసరిగా సహాయ, సహకారాలు అందిస్తానని హామీనిచ్చారు.

చంద్రయ్య కుటుంబానికి న్యాయం జరగకుండా అడ్డుకుంటున్న వైసీపీ

తోట చంద్రయ్య కుటుంబానికి న్యాయం జరగకుండా వైసీపీ అడ్డు కుంటుందని ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. వైసీపీ స్థానిక సంస్థల్లో బడుగు బలహీన వర్గాలకు కేటాయించిన 34 శాతం రిజ్వరేషన్లను 24 శాతానికి కుదించిందన్నారు. ఈ కుదింపుతో దాదాపు 16,800 మంది రాజ్యాంగ పదవులకు దూరం అవ్వటానికి జగన్‌రెడ్డి కారణం అయ్యాడని విమర్శించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో 26 మంది బీసీలను హత్య చేసి, 750 మందిపై తప్పుడు కేసులు, 2,500 మందిపై దాడులు జరిగాయన్నారు.

నారా లోకేశ్‌ను కలిసిన ప్రజా ప్రతినిధులు


లోకేశ్‌ను కలిసిన గళ్లా మాధవి, దామచర్ల శ్రీనివాస్ దంపతులు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): విజయదశమి పురస్కరించుకుని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌ను పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, ఏపి రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటి (రెరా) సభ్యుడు దామచర్ల శ్రీనివాస్ దంపతులు మర్యాదపూర్వకంగా కలిసి పట్టు వస్త్రాలను అందజేశారు.

గుంటూరులో కుశలవ హ్యుండయ్ కార్ల దసరా సంబరాలు

గుంటూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): విజయ దశమి సందర్భంగా గుంటూరులో హ్యుండయ్ కార్ల షోరూమ్‌లో అపూర్వమైన డిమాండ్ కనబడింది. హ్యుండయ్ కార్ల భారీ డిస్కౌంట్లు, ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపు వలన ఒకేరోజు 50 కార్ల వరకు అమ్మకాలు చేయడం ద్వారా గొప్ప మైలురాయిని సాధించింది. ఈ పండగ సీజన్‌లో బలమైన కస్టమర్ సెంటిమెంటును హ్యుండయ్ ప్రసిద్ధ ఎస్‌యూవీ పోర్ట్ ఫోలియో-క్రెటా, ఎక్స్టర్ యొక్క ఎంక్వయిరీలు, బుకింగ్‌లు రిటైల్ డెలివరీలో అసాధారణ పెరుగుదలను చూసినట్లు తెలిపారు. జాతీయంగా ఎస్‌యూవీలు హ్యుండయ్ విజయానికి దోహదపడ్డాయని, సెప్టెంబరులో సంస్థ దేశీయ అమ్మకాలలో 72.4 శాతం సాధించిందన్నారు. ఇది దీని చరిత్రలో అధికమని తెలిపారు. కుశలవ గుంటూరు హ్యుండయ్ ప్రతినిధి ఉస్మాన్ బేగ్ మాట్లాడుతూ అధిక కస్టమర్ స్పందన చూస్తున్నామని, మా బుకింగ్ ఆర్డర్ చాలా బలంగా ఉన్నాయి. దసరాలో 50 కార్లు పైగా పంపిణీ చేయడం గర్వకారణం అని అన్నారు. ఈ పండుగ సీజన్‌ను బ్రాండ్ కోసం ఎప్పటికప్పుడు బలమైన వాటితో ఒకటిగా నిలిపినట్లు తెలిపారు.


కుశలవ హ్యుండయ్ షోరూమ్‌లో కార్ల అమ్మకాలు

జీఎంసీకి స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డు

● 6న సీఎం చేతుల మీదుగా ప్రదానం ● కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరుకార్పొరేషన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా అమలు చేస్తున్న స్వచ్ఛ ఆంధ్ర రాష్ట్ర స్థాయి అవార్డ్‌ల్లో నగరపాలక సంస్థకు స్వచ్ఛ మున్సిపాలిటీలలో (స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డు ప్రత్యేక కేటగిరి) దక్కిందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డుని ఈ నెల 6న విజయవాడలో జరిగే స్వచ్ఛ ఆంధ్ర సభలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా నగర మేయర్, కమిషనర్లు అందుకుంటారని చెప్పారు. రాష్ట్ర స్థాయిలో తొలిసారిగా ప్రవేశ పెట్టిన అవార్డుల్లో కూడా స్థానం దక్కించుకోవడం ఆనందంగా ఉందని, ఇందుకు కృషి చేసిన ప్రజారోగ్య కార్మికులు, అధికారులు, కార్యదర్శులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, నగర ప్రజలకు అభినందనలు తెలుపుతున్నామన్నారు.

ఆక్రమణలు తొలగించాలి : కమిషనర్

రోడ్ల మీద ట్రాఫిక్ సమస్య, డ్రెయిన్లపై మురుగుపారుదలకు అడ్డుగా ఉన్న ఆక్రమణలను తొలగించాలని కమిషనర్ పులి శ్రీనివాసులు పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ పట్టాభిపురం మెయిన్‌రోడ్, భాగ్య నగర్, తుఫాన్ నగర్, మారుతి నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి, పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించి సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు ఆటో డ్రైవర్ సేవలో పథకం అమలు

రాష్ట్ర ప్రభుత్వం ఆటోవాలాలకు అండగా ఉండేందుకు ప్రతిష్టాత్మకంగా శనివారం ఆటో డ్రైవర్‌సేవలో పథకాన్ని అమలు చేయనున్నదని, అర్బన్ పరిధిలో రెవెన్యూ కళ్యాణ మండపంలో జరుగుతుందని, అర్హులైన డ్రైవర్లు యూనిఫారంతో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

ఖరీఫ్‌లో 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం : జేసీ

గుంటూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): 2025-26 ఖరీఫ్ సీజన్‌లో 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. శుక్రవారం కలక్టరేట్‌లోని డీఆర్సీ మీటింగ్ హాల్‌లో జేసీ అధ్యక్షత జరిగిన జిల్లా ధాన్య సేకరణ కమిటీ సమావేశం జరిగింది. సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 3,89,849 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనా వుందని, ఇందులో డిసెంబర్ నుంచి 50 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేయుటకు ఏర్పాటు జరుగుతుందన్నారు. 177 రైతు సేవా కేంద్రాలు, 45 రైతు సేవా క్లస్టర్ల ద్వారా ధాన్యం సేకరిస్తామన్నారు. ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాకు రూ. 2,389, సాధారణ రకానికి రూ.2,369లకు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ జయంతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గాంధీ జయంతి రోజున యథేచ్ఛగా మాంసం విక్రయాలు

గుంటూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జయంతి రోజున మాంసం విక్రయాలు బంద్ పాటించాలన్న నిబంధనలను విక్రయదారులు బేఖాతరు చేశారు. నగరపాలక సంస్థ అధికారుల ఆదేశాలను పాటించకుండా కొన్ని ప్రాంతాల్లో యధేచ్ఛగా మాంసం విక్రయాలు జరిగాయి. మహాత్మాగాంధీ జయంతి రోజున డ్రైడే కావటంతో అధికారులు నగరంలోని మాంసం దుకాణదారులకు దుకాణాలు తెరవవద్దని ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. అధికారులు పట్టించుకోకపోవటంతో మాంసం, చికెన్ విక్రయాలు యధేచ్ఛగా సాగాయి.

భార్యతో గొడవపడి యువకుడి అదృశ్యం

గుంటూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని శారదా కాలనీకి చెందిన చవన్ గోపి (32) అనే యువకుడు భార్యతో గొడవపడి అదృశ్యమయ్యాడు. భార్య గౌరీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు అరండల్‌పేట ఎస్ఐ సుబ్బారావు తెలిపారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి...

అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని నాయుడు పేట జీరో లైనుకి చెందిన చెంబేటి మల్లికార్జునరావు (32) అప్పుల నేపథ్యంలో అదృశ్యమయ్యాడు. భార్య మకర జ్యోతి ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అహింసతో బానిస సంకెళ్లు తెంచిన గాంధీజీ

● తూర్పు ఎమ్మెల్యే నసీర్


నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అహింసా ఆయుధంతో భారతదేశ బానిస సంకెళ్లు తెంచిన మహనీయుడు గాంధీజీ అని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకుని తూర్పు ఎమ్మెల్యే కార్యాలయం, హిమని సెంటర్లోని గాంధీజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ గాంధీ మహా త్ముడు 'నా జీవితమే నా సందేశం అని చెప్పడం' ద్వారా వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరూ తమకు తాము తెలుసుకోవాలని బోధించారన్నారు. స్వచ్ఛత, గ్రామ స్వరాజ్యం గాంధీజీకి రెండు కళ్లులాంటివని తెలిపారు. సీఎం చంద్ర బాబు విజనరీతో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు.

● మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి వంటి మహనీయుల త్యాగంతోనే నేటి ఈ స్వాతంత్ర్యం సిద్ధించిందని ఎమ్మెల్యే గళ్లా మాధవి చెప్పారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం ఆమె గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాల వద్ద నివాళులు అర్పించారు. ఆమె మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం, అభివృద్ధి కోసం పోరాడిన మహనీయుల త్యాగాలకు మనం ఎల్లప్పుడూ రుణపడి ఉండాలని సూచించారు.


నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

● గుంటూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం, సమానత్వం, అహింస కోసం మహాత్ముడు చేసిన పోరాటం, త్యాగ ఫలితమే నేటి మన స్వాతంత్ర్యం అని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ మాజీ చైర్మన్ దాసరి రాజామాస్టారు అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో మహాత్మా గాంధీ జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. పలువురు టీడీపీ నేతలు మహాత్ముడి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.


మహాత్ముడి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నేతలు

రాజా మాస్టారు మాట్లాడుతూ అనేక కులమతాలతో నిండిన మన దేశాన్ని ఏకతాటిపై నిలిపి ఎన్నో పోరాటాలు చేసి మన దేశానికి స్వాతంత్ర్యాన్ని అందించిన పోరాట యోధుడు మహాత్మాగాంధీ అని కొనియాడారు.

● గుంటూరు, అక్టోబరు 3 (ఆంధ్ర జ్యోతి): సత్యం, సేవాభావం అనే గొప్ప అంశాలను మహాత్మా గాంధీ దేశానికి అందించారని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అన్నారు.


నివాళులర్పిస్తోన్న కలెక్టర్, మేయర్, కమిషనర్

మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఆమె నగరపాలకసంస్థ ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి స్థానిక కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మేయర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ అహింసే ఆయుధంగా దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహనీయుడు మహాత్మా గాంధీ అని అన్నారు. కార్యక్రమంలో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, డీఆర్వో ఎన్ఎస్‌కే ఖాజా వలి, హసన్‌బాషా, డిప్యూటీ మేయర్ సజిల పాల్గొన్నారు.

● గుంటూరు(తూర్పు),అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలు గురువారం నగరంలో ఘనంగా జరిగాయి. స్థానిక లాలాపేట, మహాత్మా గాంధీ విగ్రహానికి మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాదు, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సీపీఐ నాయకులతో పాటు పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ముప్పాళ్ల నాగేశ్వరరావు, జంగాల అజయ్‌కుమార్, కోటా మాల్యాద్రి, అకిటి అరుణ్‌కుమార్, జంగాల చైతన్య, మదర్ థెరిస్సా సేవా ఫౌండేషన్ చైర్మన్ సముద్రాల కోటేశ్వరరావు, నల్లపు నీలాంబరం తదితరులు ఉన్నారు.

వైభవంగా విజయదశమి వేడుకలు

● కిటకిటలాడిన అమ్మవారి ఆలయాలు

● శ్రీ రాజరాజేశ్వరీగా దర్శనమిచ్చిన అమ్మవారు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : నగరంలో విజయదశమి పర్వదినాన్ని వైభవంగా జరుపుకున్నారు. వేకువజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఆలయ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి ప్రత్యేక మండపాల్లో అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు జరిగాయి. గో పూజ, సువాసిని, కుమారి పూజలు, సువాసినులచే సామూహిక కుంకుమార్చనలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాల్లో అమ్మవారిని శ్రీ రాజరాజేశ్వరి దేవిగా అలంకరించారు. సామూహిక తులసి పూజలు, మహావిద్య హోమం, సహస్ర నామార్చనలు నిర్వహించారు. పలు దేవాలయాల వద్ద అన్నదాన వితరణ జరిగింది. ఆయా దేవాలయాల వద్ద ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవాలు కనుల పండువగా నిర్వహించారు. అనంతరం అమ్మవారికి కట్టిన వస్త్రాలను వేలం నిర్వహించారు. పూజలలో ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.

● గుంటూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): గుంటూరులోని శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం, శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం, శ్రీచుట్టుగుంట పోలేరమ్మ తల్లి ఆలయం, సంగడిగుంట శ్రీ కనకదుర్గమ్మ తల్లి ఆలయం, బృందావన్‌గార్డెన్స్, బ్రాడీపేట, వసంతరాయపురం, గౌతమీ నగర్, కొరిటపాడు, పాతగుంటూరులోని అనేక ఆలయాల్లో అమ్మవారి దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. గుంటూరులోని పెద్దపులి సందులో గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిసాసుర మర్దినిగా అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం నుంచి అమ్మవారి ఉత్సవిగ్రహాన్ని పురవీధుల్లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, ఏపీ ఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, కొనకళ్ళ సత్యం, కోట శేషగిరి తదితరులు ఊరేగింపు మహోత్సవాన్ని ప్రారంభించారు. కోలాటాలు, చెక్కభజనలు, వివిధ వేషధారణలతో అమ్మవారి విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. సంగడిగుంటలోని శ్రీ కనకదుర్గమ్మ ఆలయం ఎదుట కృత్రిమంగా టార్పాలియన్ పట్టాలతో కొలను ఏర్పాటు చేసి అమ్మవారి ఉత్సవ విగ్రహంతో తెప్పోత్సవం నిర్వహించారు. చుట్టుగుంట పోలేరమ్మ తల్లి ఆలయం వద్ద కూడా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు.


గుంటూరులో భక్తుల మధ్య శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి ఊరేగింపు

అన్నదానం మహా పుణ్యకార్యం

విజయదశమి రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహించటం మహా పుణ్యకార్యం లాంటిదని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర (నాని) పేర్కొన్నారు. చుట్టుగుంట శ్రీ పోలేరమ్మతల్లి ఆలయాన్ని దర్శించుకున్న మేయర్ రవీంద్ర అనంతరం అన్న సంతర్పణ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఉత్సవ సభ్యులు అంగడి శ్రీనివాసరావు, అడకా శ్రీనివాసరావు, ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్, వెంపాటి సాంబిరెడ్డి తదితరులున్నారు.

నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీలు

గుంటూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : రౌడీషీటర్స్ కదలికలపై నిఘా ఉంచాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఎస్పీ నల్లపాడు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. దొంగతనాలు, చైన్‌స్నచింగ్ నేరాలు జరగకుండా తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు సౌత్ డీఎస్పీ భానోదయ, ఎస్పి సీఐ అళహరి శ్రీనివాస్, నల్లపాడు సీఐ వంశీధర్, ఎస్సైలు , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైస్ మిల్లు యజమానికి సైబర్ నేరగాళ్ల కుచ్చుటోపి

స్థానిక పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎస్‌వీఎన్ కాలనీ 5వ లైన్ కి చెందిన నల్లూరి వెంకటేశ్వర్లు (68) అనే రైస్ మిల్లు యజమాని నుంచి సైబర్ నేరగాళ్లు కోటి రూపాయలు మోసం చేసి కొట్టేశారు. పట్టాభిపురం సిఐ గంగా వెంకటేశ్వర్లు కథనం రెండు వారాల క్రితం నల్లూరి వెంకటేశ్వర్లు సెల్ ఫోనుకు హాయ్ అంటూ మెసేజ్ వచ్చింది. ఆయన స్పందించి రిప్లై ఇవ్వడంతో ఆ తర్వాత ఓ మహిళ ఫోన్ చేసి మాటలు కలిపి ముగ్గులోకి దించింది. కొద్దిరోజుల తర్వాత వెంకటేశ్వర్లుకు వేరేవారు ఫోన్లు చేసి తాము హైదరాబాద్ పోలీసులమనీ, మీరు మహిళతో అసభ్యంగా చాట్ చేస్తున్నట్లు ఆమె భర్త ఇచ్చిన రిపోర్ట్‌పై మీ మీద కేసు అయిందని, మిమ్మల్ని కేసు నుంచి తప్పించడానికి డబ్బులు ఇవ్వాలని, అలగే మరొకరు ఇన్‌కంట్యాక్స్ అధికారులమని, మిల్లుపై రైడ్ చేయడానికి వస్తున్నామని బెదిరించి సుమారు కోటి రూపాయల వరకు డబ్బులు వారి అకౌంట్‌లకు పంపించుకున్నారు. వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ తగాదాని రాజకీయం చేయకండి

● తుళ్లూరు డీఎస్పీ మురళీ కృష్ణ

గుంటూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : మేడికొండూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని సిరిపురం గ్రామంలో కుటుంబ తగాదా కేసుని రాజకీయం చేసి, శాంతి భద్రతల సమస్య సృష్టించవద్దని తుళ్ళూరు డీఎస్పీ మురళీకృష్ణ సూచించారు. రావినూతల. కోటేశ్వరరావు, జ్యోతి దంపతులు తమ పిల్లలతో సిరిపురంలో నివాసం ఉంటున్నారన్నారు. వాళ్ళిద్దరికీ చిన్న మనస్పర్థలు రాగా, కోటేశ్వరరావు భార్య, పిల్లలని వదిలిపెట్టి అదే గ్రామంలో ఉంటున్న తన అక్క బంకా కోటేశ్వరమ్మ ఇంట్లో నివాసం ఉంటున్నాడన్నారు. ఈ క్రమంలో సెప్టెంబరు 12, 14 తేదీల్లో వారు గొడవపడి ఇరువైపుల వారు పోలీస్‌స్టేషన్‌కు రాగా ఎస్ఐ ఇది భార్యాభర్తల గొడవ అని సర్దిచెప్పి, కౌన్సెలింగ్ చేసి భార్యభర్తలు సక్రమంగా ఉండాలని చెప్పి పంపించారన్నారు. గత నెల 24న తన భార్యపై ఏదోవిధంగా కక్ష తీర్చుకోవాలనే కారణంతో కోటేశ్వరరావు ఎలుకల మందు తాగి హాస్పిటల్‌లో చేరాడన్నారు. ఆ తర్వాత ఈ విషయం కౌన్సెలింగ్‌తో పరిష్కారం కావట్లేదని మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు అనంతరం నిందితులను అరెస్టు చేశారన్నారు. కోటేశ్వరరావు తరఫున రావూరి దివ్య ఎన్‌టీఆర్ జిల్లా నుంచి వచ్చి ఈ కేసుకు రాజకీయ రంగు పులమడం, పోలీసులు, సీఐ మీద, రాజకీయ నాయకుల మీద అభ్యంతరకర వ్యాఖ్యలతో ప్లకార్డులు పట్టుకొని ఈ కేసును తప్పుదారి పట్టిస్తుందన్నారు. కాగా రావూరి దివ్యపై ఇప్పటికే ప్రకాశం, నెల్లూరు, ఎన్‌టీఆర్ జిల్లాల్లో మూడు కేసులు నమోదైనట్లు డీఎస్పీ మురళీకృష్ణ తెలిపారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని తగలబెట్టడం దుర్మార్గం

గుంటూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని చిత్తూరు జిల్లా వెదుళ్ల కుప్పం మండలం దేవళంపేట లో నిప్పు పెట్టి తగల పెట్టడం అత్యంత దుర్మార్గమని వి సి కె పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు శైలా జయసుధ అన్నారు. ఈ మేరకు స్థానిక లాడ్జి సెంటర్ నందు గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం పలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు పాటిబండ్ల కోటేశ్వరరావు, మల్లెల వెంకట్రావు, నల్లపు నీలాంబరం, సాధు మాల్యాద్రి, డెన్నిస్ రాయ్, ఓర్సు ప్రేమరాజు, వద్దిముక్కల సురేష్, తాడికొండ నరసింహారావు, రహిమాన్, లాయర్ శ్రీనివాసరావు, మంచాల జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపండి

● రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠీ

గుంటూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపాలని రేంజ్ ఐజి సర్వశేష్ఠ త్రిపాఠి ఆదేశించారు. గుంటూరు రేంజ్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా అదనపు ఎస్పీలు, డీఎస్పీలతో శుక్రవారం నిర్వహించిన 'నేర సమీక్ష సమావేశం'లో పాల్గొని, పోలీస్ అధికారులకు నేర నియంత్రణ పట్ల పలు ఆదేశాలు జారీ చేశారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నిరోధానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఇతర ఆర్థిక నేరాలు, హత్యలు, అత్యాచారాలు, దొంగతనాలు, దోపిడీలు వంటి నేరాలను నియంత్రించేందుకు ప్రత్యేక బృందాలను నియమించి, వాటిని నియంత్రించడానికి ప్రణాళికలను రూపొందించాలని తెలిపారు. ఎస్పీ వకుల్ జిందాల్ నేతృత్వంలో అదనపు ఎస్పీలు, డిఎస్పీలు దతితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు తెంచుకెళ్లిన అగంతకుడు

స్థానిక అరండల్ పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లికార్జునపేట 5/5 లో శుక్రవారం రాత్రి అగంతకుడు నడుచుకుంటూ వచ్చి మహిళ మెడలో గొలుసు తెంచుకొని పరారయ్యాడు. మల్లికార్జునపేటకు చెందిన భూక్య బాగ్యమ్మ బాయ్ బంధువుల ఇంటికి వెళ్లి వస్తుండగా ఇంటి సమీపానికి వెళ్లేసరికి వెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలోని బంగారపు గొలుసును తెంచుకుని పరారయ్యాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు అరండల్‌పేట సీఐ ఆరోగ్య రాజు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్స్, దుకాణం దహనం చేసిన నిందితుడి అరెస్టు

స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని స్తంభాలగరువులో బైక్స్, దుకాణం దహనం చేసిన కేసులో నిందితుడైన అదే ప్రాంతానికి చెందిన షేక్ మహమ్మూద్‌ను పోలీసులు అరెస్టు చేసారు. పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సీఐ గంగా వెంకటేశ్వర్లు నిందితుడిని మీడియా ఎదుట హాజరుపరిచారు. ఈ కేసులో టైలరింగ్ షాపు యజమాని మధుసూదన్‌రెడ్డి, ద్విచక్ర వాహనాల యజమాని శివరామ్ గతంలో షేక్ మహమూద్ బంధువైన కరీముల్లాని ఎకో పార్కు వద్ద హత్య చేసిన కేసులో నిందితులుగా ఉన్నారు. మధుసూదన్‌రెడ్డి బెయిల్‌పై వచ్చిన తర్వాత అతని వద్దకు షేక్ మహమ్మద్ వెళ్లి చనిపోయిన కరీముల్లా పిల్లలకు న్యాయం చేయమని కోరగా అందుకు అతను నిరాకరించారు. అది మనసులో పెట్టుకొని షేక్ మహమూద్ 29న రాత్రి పెట్రోలు పోసి టైలరింగ్ షాపును, బైకులను తగలబెట్టినట్లు సీఐ తెలిపారు. షేక్ మహమూద్‌ని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించారు.

ఉరి వేసుకుని డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య

స్థానిక నగరంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని సాయి నగర్ కు చెందిన యర్రగొర్ల శివ మౌనిక (20) అనే డిగ్రీ విద్యార్థిని ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి సోమయ్య ఫిర్యాదు మేరకు నగరంపాలెం ఎస్సై రాంబాబు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మౌనిక ఆత్మహత్యకు దారి తీసిన కారణాలు కుటుంబ సభ్యులు చెప్పలేకపోతున్నారు.

ప్రజల మన్ననలను పొందుతున్న సెవెన్ హిల్స్ ఫార్మసీ


ఫార్మసీ షాపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నసీర్, ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్

గుంటూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సేవే లక్ష్యంగా ప్రజలకు నాణ్యమైన మందులను అత్యధిక డిస్కౌంట్ ధరలకే అందిస్తూ ప్రజల మన్ననలను పొందుతున్న ఏకైక ఫార్మసీ సెవెన్ హిల్స్ ఫార్మసీ అని సెవెన్ హిల్స్ ఫార్మసీ చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ అన్నారు. గుంటూరు మాయాబజార్ సెంటర్లో నూతనంగా ఏర్పాటు చేసిన సెవెన్ హిల్స్ ఫార్మసీ 18వ షాపును గురువారం ఆయన, తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ హాజరై ప్రారంభించారు. చైర్మన్ డేగల ప్రభాకర్ మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా ప్రజా సేవే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఏకైక ఫార్మసీ సెవెన్ హిల్స్ అని చెప్పారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ప్రజలు, కస్టమర్లు సెవెన్ హిల్స్ ఫార్మసీపై చూపిస్తున్న ఆదరణకు నిదర్శనమే సెవెన్ హిల్స్ 18వ షాపు ఏర్పాటు అన్నారు. కార్యక్రమంలో హజ్ కమిటీ చైర్మన్ షేక్ హసన్ బాషా, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ షేక్ సజీల, కార్పొరేటర్లు ఖాజా మొయిద్దీన్, యర్రగోపు నాగేశ్వరరావు, మహంకాళి నరసింహారావు, జాగర్లమూడి శ్రీను, అమర్నాథ్, రాగం సదా శివరావు, మేకల బాబు రావు,బొక్కిసం శివరాం పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో ఆలయాలకు మహర్దశ : ఎమ్మెల్యే నసీర్

కూటమి ప్రభుత్వం రాకతో రాష్ట్రంలో దేవాలయాలకు మహర్దశ వచ్చిందని, కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తోందని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. పాత గుంటూరులోని అగస్త్యేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా గాలి సతీష్ బాబుతోపాటు కమిటీ సభ్యులు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంతో ప్రాశస్త్యం కలిగిన అగస్త్యేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి నూతన కమిటీ ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఈవో సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల కిట్లు పంపిణీ

ప్రజారోగ్య పరిరక్షణలో ప్రతి నిత్యం సేవలు అందించే మున్సిపల్ కార్మికులకు సాయమందించడం సంతోషకరమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. టీడీపీ నేత ఏల్చూరి సహకారంతో నగరంలోని మున్సిపల్ కార్మికులు దసరా కానుకగా నిత్యవసర సరుకులను ఆయన అందజేశారు.

డీఎస్ నగర్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

స్థానిక డీఎస్ నగర్లో రూ.50 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక చాకలి గుంట అభివృద్ధి పనులు చేపట్టామని, నల్లచెరువు వాకింగ్ ట్రాక్, జిమ్ పరికరాలు ఏర్పాటు చేశామని చెప్పారు. పీకల వాగు అవుట్ ఫాల్‌కు సంబంధించిన పనులు త్వరలోనే చేపడతామని చెప్పారు.

గాలి నాణ్యత మెరుగుదల చర్యలు వేగవంతం చేయాలి : కలెక్టర్

గుంటూరు(తూర్పు), అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో గాలి నాణ్యత ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కాలుష్య నివారణ చర్యలను వేగవంతం చేయాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో వీసీ సమావేశం మందిరంలో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్‌సిఏపి) ద్వారా నగరపాలక సంస్థ పరిధిలో చేపడుతున్న పనుల పురోగతిపై జరిగిన జిల్లా స్థాయి అమలు కమిటీ (డిఎల్ఐసి) సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులుతో ఆమె కలిసి సమీక్షించారు. ఎన్‌సీఏపీ ద్వారా నగరపాలక సంస్థ పరిధిలో కాలుష్య నివారణకు రహదారుల అభివృద్ధి, మొక్కలు నాటే పనులపై కలెక్టర్ సమీక్షించి, అధికారులకు సూచనలు అందించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈ ఈ నసీనా బేగం, డీఎఫ్‌వో హిమ శైలజ, డిటిసి సీతారామిరెడ్డి, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జయలక్ష్మి, కార్పొరేషన్ ఇంచార్జ్ ఎస్ఈ సుందరరామిరెడ్డి, సిపిసిబి కన్సల్టెంట్ కోమలి పాల్గొన్నారు.

లాభదాయకత పెరగాలి

గుంటూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల్లో పెట్టుబడులకు అనుగుణంగా రైతులకు లాభదాయకత పెరగాలని కలెక్టర్ అన్సారియా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రాథమిక, సెకండరీ రంగాల శాఖలతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక రంగాల శాఖలు నూతన ఆవిష్కరణలు దిశగా అడుగులు వేస్తూ వ్యవసాయ, అనుబంధ రంగాల్లో లాభదాయకత పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ అయితా నాగేశ్వరరావు, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకుడు కేవీవీ సత్య నారాయణ సీపీవో శేషశ్రీ, జిల్లా మత్స్య శాఖ అధికారి పీఎస్ కిరణ్ కుమార్, డీఎఫ్‌వో, జలవనరులు శాఖ పర్యవేక్షక ఇంజనీర్, భూగర్భ జలవనరులు శాఖ, ఉద్యాన శాఖ ఉప సంచాలకులు, ఏపీ ఎం.ఐ.పి, తదితర అధికారులు పాల్గొన్నారు.

● పరిశ్రమలు, సేవా రంగాల్లో అనుమతుల మంజూరు ఆలస్యం కారాదని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు. ప్రస్తుతం జరుగుతున్న పనులు వేగవంతం కావాలని స్పష్టం చేశారు. సమావేశంలో జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, కమిషనర్ శ్రీనివాసులు, కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వాహక ఇంజనీర్ నజీన బేగం, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఏ జయలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కళ్యాణ చక్రవర్తి, మైనింగ్ డీడీ ఎన్ చంద్రశేఖర్, రహదారులు, భవనాల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ ఆర్ శ్రీనివాస మూర్తి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి జ్యోతి బసు, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎస్ఎస్‌వీ రమణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయలక్ష్మి, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి ప్రసూన, జిల్లా పంచాయతీ అధికారి బీవీ నాగ సాయి కుమార్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి మయూరి, వివిధ మున్సిపాలిటీల కమిషనర్లు పాల్గొన్నారు.



బీజాపూర్ జిల్లాలో లొంగిపోయిన మావోయిస్టులు

ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు గిరిజనుల హత్య

- మావోయిస్టుల ఘాతుకం.. బీజాపూర్ జిల్లాలో లొంగిపోయిన
- 103మంది మావోయిస్టులు

చర్ల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, సుకుమా జిలాల్లో మావోయిస్టులు ఇద్దరు గిరిజనులను హత్య చేశారు. బీజాపూర్ జిల్లా పూజారి కాంకేర్ గ్రామానికి చెందిన మడకం భీమా(45)ను మావోయిస్టులు గురువారం అతని ఇంటి ఆవరణలోనే దారుణంగా కత్తులతో పొడిచి చంపేశారు. భీమా 2018లో తెలంగాణలోకి వెళ్లిపోయి, ములుగు జిల్లాలో ఓ ఎస్ఐతో కలిసి పని చేశాడని, గ్రామంలో పోలీస్ క్యాంప్ పెట్టిన తరువాత తిరిగి వచ్చి, ప్రజలను బెదిరిస్తూ, రూ.లక్షలు దోచుకుంటున్నాడని, భూములు ఆక్రమిస్తున్నాడని అందుకే హత్య చేశామని మావోయిస్టులు ఓ లేఖలో పేర్కొన్నారు. అలాగే సుకుమా జిల్లా కిష్టారం అడవుల్లో ఓ గిరిజనుడిని మావోయిస్టులు హతమార్చారు. ఇదిలా ఉంటే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం గంగలూరు అడవుల్లో గురువారం సాయంత్రం ఎన్‌కౌంటర్ జరిగింది. ఒక మావోయిస్టు చనిపోయాడు. మరోవైపు, బీజాపూర్ జిల్లా పోలీసులు ఎదుట గురువారం 103 మంది మావోయిస్టు పార్టీ సభ్యులు లొంగిపోయారు. వీరిలో 22 మంది మహిళలున్నారు. లొంగి పోయిన వారిలో 47మందిపై మొత్తం కలిపి రూ.1.06కోట్ల రివార్డులున్నట్టు ఎస్పీ జితేంద్ర యాదవ్ తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 421మంది మావోయిస్టులు అరెస్టయ్యారని, 410 మంది లొంగి పోయారని, 137 మంది ఎన్‌కౌంటర్లలో మృతి చెందారని వెల్లడించారు.

అసభ్య పోస్టుల కేసులో అంజద్ బాషా పీఏ అరెస్టు

- కడప కోర్టులో హాజరు.. బెయిల్ మంజూరు

కడప క్రైం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కడప ఎమ్మెల్యే ఆర్.మాధవిపై అసభ్య పదజాలంతో ఉన్న వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేసిన కేసులో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పీఏ షేక్ మహ్మద్‌ఖాజాను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం అతన్ని కడప ఎక్సైజ్ కోర్టులో హాజరు పరచగా.. సొంత పూచీకత్తుపై అతనికి కోర్టు బెయిలు మంజూరు చేసింది. ఆ వివరాలను కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, వన్‌టౌన్ సీఐ రామకృష్ణ విలేకరులకు వివరించారు. కడప అక్బర్ వీధికి చెందిన షేక్ మహ్మద్ ఖాజా మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు పీఏగా పనిచేస్తున్నాడు. 2024 ఎన్నికల సమయంలో ప్రస్తుత కడప ఎమ్మెల్యే మాధవి, ఆమె భర్త శ్రీనివాసరెడ్డిపై కడప అలంఖాన్‌పల్లెకు చెందిన విజయలక్ష్మి అసభ్యకరంగా మాట్లాడారు. ఆ వీడియోను అంజద్‌బాషా అతని సోదరుడు అహ్మద్‌బాషా ప్రోద్బలంతో సోషల్ మీడియాలో షేక్ మహ్మద్‌ఖాజా పోస్టు చేశాడు. ఈ వీడియో వైరల్ కావడంతో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు అంజద్‌బాషా, అహ్మద్‌బాషా, షేక్ మహ్మద్‌ఖాజాలపై కేసు నమోదు చేశారు. షేక్ మహ్మద్ ఖాజాను బుధవారం హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. గురువారం కోర్టులో హాజరు పరిచారు. ఎవరైనా సోషల్ మీడియాలో అసభ్యకరమైన వీడియోలు పోస్టు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

'సిట్' ముందు హాజరైన మిథున్‌రెడ్డి

విజయవాడ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో నిందితుడిగా ఉన్న రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి విజయవాడలోని సిట్ అధికారుల ముందు శుక్రవారం హాజరయ్యారు. ప్రతి సోమవారం, శుక్రవారం సిట్ అధికారుల ముందు హాజరవ్వాలని కోర్టు బెయిల్ ఉత్తర్వుల్లో షరతు విధించింది. దాని ప్రకారం మిథున్‌రెడ్డి సిట్ కార్యాలయానికి వచ్చి పుస్తకాల్లో సంతకం చేశారు. ఇటీవలే ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం నుంచి విడుదలైన విషయం తెలిసిందే.



సర్జరీ సిస్టమ్‌ను ప్రారంభిస్తున్న సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యుడు చక్రవర్తి, పక్కన సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ తదితరులు

'సత్యసాయి' ఆస్పత్రిలో రోబోటిక్ సర్జరీ సేవలు

- గుండె, యూరాలజీ విభాగంలో అందుబాటులోకి సేవలు

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అత్యాధునిక రోబోటిక్ సర్జరీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. రూ.8 కోట్ల విలువైన అత్యాధునిక రోబోటిక్ సర్జరీ వ్యవస్థను సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, సభ్యుడు చక్రవర్తి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ, భగవాన్ సత్యసాయి ధ్యేయమైన విలువలు, కరుణ, ప్రేమతో కూడిన అత్యాధునిక వైద్యాన్ని ఉచితంగా అందుబాటులోకి తెచ్చామన్నారు. ఎస్ఎస్ ఇన్నొవేషన్స్ అనే భారతీయ సంస్థ ప్రపంచ స్థాయి ప్రమాణాలకు తగ్గట్లు ఈ రోబోటిక్ శస్త్ర చికిత్స వ్యవస్థను అభివృద్ధి చేసిందన్నారు. ఈ వ్యవస్థతో శరీరంలోని సున్నితమైన ప్రాంతాలకు కూడా అత్యంత కచ్చితత్వంతో, సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలను సులభతరంగా చేయవచ్చని వెల్లడించారు. రోబోటిక్ సర్జరీకి రూ.లక్షలు ఖర్చు అవుతుందని, కానీ సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పూర్తి ఉచితంగా అందుతుందని స్పష్టం చేశారు.



రోబోటిక్ సర్జరీ యంత్రాలు

ములకలచెరువు కేంద్రంగా
నకిలీ మద్యం తయారీ

- రూ.1.75 కోట్ల విలువైన నకిలీ మద్యం స్వాధీనం
- స్పిరిట్, బాటిళ్లు, పరికరాలు సీజ్.. 9 మంది అరెస్టు



నకిలీ మద్యాన్ని తయారు చేస్తున్న దృశ్యం.. స్వాధీనం చేసుకున్న నకిలీ మద్యం బాక్సులు

రాయచోటి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ములకలచెరువులో శుక్రవారం ఎక్సైజ్ అధికారులు దాడులు జరిపి రూ.1.75కోట్ల విలువైన నకిలీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కడప ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. అనంతరం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. విజయవాడకు చెందిన జనార్దన్‌రావు, ఆయన అనుచరుడు రాజు ములకలచెరువుకు సమీపంలోని కనుగొండ ఆర్చి సమీపంలో ఉన్న పాత దాబాను అద్దెకు తీసుకుని నకిలీ మద్యం తయారు చేస్తున్నారు. ఈ మద్యాన్ని వాహనం ద్వారా తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ ధర కంటే తక్కువకే ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పలు ప్రభుత్వ మద్యం షాపులకు కూడా ఈ మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. ఇటీవల జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పెద్దతిప్ప సముద్రం మండలంలో తనిఖీలు నిర్వహిస్తూ.. నకిలీ మద్యం తీసుకెళ్తున్న వాహనాన్ని నిలిపారు. బాటిళ్ల మీద ఉన్న లేబుల్‌ను స్కాన్ చేశారు. అయితే స్కాన్ కాకపోవడంతో అనుమానం వచ్చి విషయాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ వ్యవహారంపై ఎక్సైజ్ డైరెక్టర్ రాహుల్ దేవ్‌కు ఫిర్యాదులు అందడంతో అధికారులు గత నాలుగు రోజులుగా నిఘా ఉంచి శుక్రవారం ఈ దాడులు చేశారు. 15 వేల నకిలీ మద్యం బాటిళ్లు, 1050 లీటర్ల స్పిరిట్ క్యాన్లు, 1500 లీటర్ల బ్లెండ్(తయారైన నకిలీ మద్యం), 10 వేల ఖాళీ మద్యం బాటిళ్లు, 4 వేల మద్యం సీసా మూతలు.. స్టిక్కర్లు, మద్యం బాటిళ్లు తయారు చేసే పరికరాలు, ఇతర సామగ్రి, నకిలీ మద్యం సరఫరా చేసే వాహనాన్ని సీజ్ చేశారు. తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరికి చెందిన మరిమారన్, తిరుపత్తూరుకు చెందిన సురేశ్, సూర్య, ఆనందన్, ఒడిశా రాష్ట్రం బ్రహ్మపూర్‌కు చెందిన ఆనంద్ దాస్, మిదున్, విశాఖపట్నానికి చెందిన స య్యాద్ అలీ, వాహన డ్రైవర్ బాలరాజు, నకిలీ మద్యం కలిగి ఉన్న బెల్ట్ షాపు నిర్వాహకుడు రంగసముద్రానికి చెందిన నాగరాజు, పెద్దతిప్ప సముద్రంలోని మద్యం దుకాణ నిర్వాహకుడు టీడీపీ నేత కట్టా సురేంద్రనాయుడును అరెస్టు చేశారు. విజయవాడకు చెందిన జనార్దన్‌రావు, అతని అనుచరుడు రాజు, ములకలచెరువులోని రాక్‌స్టార్ ప్రభు త్వ మద్యం దుకాణ నిర్వాహకుడు రాజేశ్ తదితరులపైనా కేసు నమోదు చేశారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

నిందితుల్లో తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి పీఏ

రాజేశ్ తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పీఏగా పనిచేస్తున్నారు. ఇతని పేరుతో ఉన్న వాహనం ద్వారానే నకిలీ మద్యం సరఫరా చేస్తున్నారు. దీనిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఈ నకిలీ మద్యం తయారీ వెనుక తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ముఖ్య నాయకుల సమీప బంధువుల ప్రమేయం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ నకిలీ మద్యం తయారీలో జిల్లాలోని పలువురు టీడీపీ నాయకుల హస్తం ఉన్నట్టు కూడా ఆరోపణలు వినిస్తున్నాయి. నియోజకవర్గంలోని పలు బెల్ట్‌షాపులు, ప్రభుత్వ మద్యం దుకాణాల్లోనూ ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు.

గ్యాంగ్ రేప్ కేసు నిందితులకు రిమాండ్

- గత నెల 25న చిత్తూరు సమీపంలో బాలికపై అఘాయిత్యం

చిత్తూరు అర్బన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల చిత్తూరులో ఇంటర్ విద్యార్థినిపై గ్యాంగ్ రేప్‌కు పాల్పడిన ముగ్గురు యువకులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ సాయినాథ్ మీడియాకు వివరించారు. గత నెల 25వ తేదీన చిత్తూరు నగర సమీపంలో ఉన్న నీవా నగర వనం పార్కుకు వచ్చిన యువ జంటను ముగ్గురు యువకులు బెదిరించారు. బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ జంటలోని యువకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 29వ తేదీన పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితులైన మహేష్, కిశోర్, హేమంత్‌ను శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ముగ్గురు నిందితులకు పోక్సో కోర్టు ఈ నెల 16 వరకు రిమాండ్ విధించింది. నిందితుల్లో ఒకరైన మహేష్ ఓ బాలికను ఈవ్ టీజింగ్ చేసిన కేసులో నిందితుడిగా ఉన్నాడు. కిశోర్ 2022లో నగరంలోని ఓ వైన్ షాపులో పనిచేస్తుండగా అక్కడి మద్యాన్ని బ్లాక్‌లో విక్రయించాడని అతనిపై కేసు నమోదైంది. కాలక్షేపం కోసం పార్కులకు వచ్చే ప్రేమ జంటలను లక్ష్యంగా చేసుకుని వారు కలిసున్న దృశ్యాలను వీడియో తీసి వారిని బెదిరించడం.. వారి వద్ద ఉన్న నగదు, బంగారాన్ని లాక్కోవడం.. లైంగిక వేధింపులకు పాల్పడటం.. వీరి నేర ప్రవృత్తిగా పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. కాగా.. నిందితుల్ని స్థానిక డీపీవో కార్యాలయం నుంచి అర కిలో మీటరు దూరంలో ఉన్న కోర్టు వరకు బేడీలు వేసి రోడ్డుపై నడిపించుకుంటూ తీసుకెళ్లారు.

హోటల్ సిబ్బందిపై వైసీపీ నేత నాగార్జున యాదవ్ దాడి

- అల్పాహారం ఆలస్యంగా ఇచ్చారని దౌర్జన్యం
- ఇరువురికి గాయాలు.. కేసు నమోదు



హోటల్ యజమాని కొడుకు ప్రేమ్‌కుమార్

సత్తెనపల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అల్పాహారం తీసుకురావడంలో ఆలస్యం అయిందని హోటల్ యజమాని, సిబ్బందిపై వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్ అతని అనుచరులు రెచ్చిపోయారు. వారిపై దాడి చేసి గాయపర్చారు. ఈ దాడి ఘటన గురువారం రాత్రి పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని తాలూకాసెంటర్‌లో జరిగింది. రాత్రి 10 గంటల సమయంలో నాగార్జున యాదవ్ అతని అనుచరులు పట్టణంలోని గుడ్‌మార్నింగ్ హోటల్‌కు టిఫిన్ చేసేందుకు వచ్చారు. టిఫిన్ అందించడం ఆలస్యమవుతుందని నాగార్జునయాదవ్ అతని అనుచరులు గొడవకు దిగారు. హోటల్ యజమాని శేఖర్, అతని కుమారుడు ప్రేమ్‌కుమార్, వర్కర్ నాగేశ్వరరావుపై దాడి చేశారు. ఈ ఘటనలో ప్రేమ్‌కుమార్, వర్కర్‌కు గాయాలయ్యాయి. తనతో పెట్టుకుంటే అబ్బూరు ఊరు ఊరంతా కదిలొస్తుందంటూ హోటల్ యజమాని శేఖర్‌ను నాగార్జున యాదవ్ బెదిరించారు. దాడి ఘటనపై హోటల్ యజమాని శేఖర్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



హోటల్ యజమానిపై దౌర్జన్యం చేస్తున్న వైసీపీ నాయుకుడు యనమల నాగార్జునయాదవ్

కృష్ణానదికి తగ్గిన వరద

- ఊపిరి పీల్చుకున్న తీర ప్రాంతవాసులు
- ముంపు నుంచి బయటపడ్డ గ్రామాలు
- వాణిజ్య, కూరగాయ పంటలకు తీవ్ర నష్టం
- లంక గ్రామాల్లోని రహదారులు ఛిద్రం
- పునరావాస కేంద్రాల నుంచి ఇళ్లకు ప్రజలు
- నష్టపరిహారంతో ఆదుకోవాలని ప్రభుత్వానికి వేడుకోలు



వరదకు దెబ్బతిన్న కంద పంట

రేపల్లె, కొల్లూరు, భట్టిప్రోలు, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): కృష్ణానదికి వరద తగ్గడంతో తీర ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వరద నీటిలో నుంచి పల్లెపాలెంలు బయటపడ్డాయి. పునరావస కేంద్రాల్లోని ప్రజలు తమసామగ్రితో గృహాలకు చేరకుంటున్నారు. గృహాల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించుకుంటున్నారు. 20 గృహాల వరకు పూర్తిగా దెబ్బతిన్నాయి. గృహ సామగ్రి బురదమయంగా మారడంతో పల్లెపాలెం వాసులు తీవ్రనష్టం వాటిల్లిందంటూ బోరున విలపిస్తున్నారు. కూలిపోయిన గృహాల ప్రజలను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

వరద నీటిలో.. కొండ చిలువలు



కొల్లూరు కరకట్ట దిగువున కొండ చిలువ

ఎగువ నుంచి వచ్చిన వరద నీటితో పాటు కొండ చిలువలు కూడా కొట్టుకు వచ్చాయి. కొల్లూరు కరకట్ట దిగువున ఆవులవారిపాలెం గ్రామానికి ట్రాక్టర్‌పై వెళ్తున్న గ్రామస్తులకు, అదే గ్రామానికి చెందిన ద్విచక్ర వాహన దారుడికి కొండ చిలువలు తారసపడ్డాయి. దీంతో ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

వరద నీటిలోనే వాణిజ్య పంటలు

కృష్ణానది ఒడ్డున ఉన్న లంక గ్రామాల్లోని వాణిజ్య పంటలు అరటి, కంద, పెండలం, పసుపుతో పాటు దోస, బెండ, దొండ, పొట్లకాయ, బీరకాయ, పచ్చిమిర్చి అలాగే ఆకుకూర తోటలు వేలాది ఎకరాలు కుళ్లిపోయి దర్శనమిస్తున్నాయి. పల్లపు ప్రాంతాల్లో నీటిలోనే పంటలు ఇంకా నానుతున్నాయి. ఎకరాకు ఇప్పటికే లక్షన్నర నుంచి రెండున్నర లక్షల రూపాయల వరకు ఆయా పెట్టుబడి పెట్టామని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.. రొయ్యల చెరువులు ఎకరాకు రెండున్నర నుంచి మూడున్నర లక్షల రూపాయల వరకు పెట్టుబడి పెట్టామని.. రైతులు చెబుతున్నారు. వరద నీటిలో చెరువులన్నీ కొట్టుకుపోయాయని, చెరువుల్లో సామగ్రి, మోటార్లు పూర్తిగా నీటిలో నానుతున్నాయని విద్యుత్ స్తంభాలు ఎక్కడికక్కడ నేలవాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరద కారణంగా నష్టపోయిన గృహాలు, వాణిజ్య పంటలు, రొయ్యల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

దెబ్బతిన్న రహదారులు..

కృష్ణానది వరద ఉధృతికి లంక గ్రామాల రహదారులు కోతకు గురయ్యాయి. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో సాగు చేస్తున్న కంద, అరటి, పసుపు, బొప్పాయి, కూరగాయ, మినుము తదితర పంటలు వరద ముంపునకు గురై నాలుగైదు రోజులుగా నీటిలోనే ఉన్నాయి. గురువారం సాయంత్రం నుంచి కృష్ణానదిలో వరద ప్రవాహం తగ్గడంతో ముంపునకు గురైన వాణిజ్య పంటలు చాలా వరకు బయట పడ్డాయి. కొల్లూరు దోనేపూడి వద్ద పొలాలకు వెళ్లే దారిలో తారు రోడ్డు పలు చోట్ల కోతకు గురైంది. ఆవులవారిపాలెం శ్మశాన వాటిక వద్ద సిమెంట్ రోడ్డుకు ఉన్న అప్రోచ్ వరద ఉధృతికి కొట్టుకుపోయింది. దోనేపూడి నుంచి పోతార్లంకకు వెళ్లే పంచాయితీ రహదారి, జువ్వలపాలెంతో పాటు భట్టిప్రోలు మండలం పెసర్లంక, పెదలంక పరిధిలో కూడా రహదారులు వరద ఉధృతికి కోత పడ్డాయి. అధికారులు ఆయా రహదారులను పరిశీలించి రోడ్లను పునః నిర్మించాలని రైతులు కోరుతున్నారు.



తిప్పలకట్ట వద్ద వరద ఉధృతికి భారీగా కోతకు గురైన భూమి



వరద ఉధృతికి దోనేపూడి వద్ద కోతకు గురైన రహదారి



పోతార్లంక చప్టాపై తొలగని వరద నీరు



వరద ముంపు నుంచి బయటపడ్డ పెనుమూడిపల్లె పాలెం



కోతకు గురైన గొరికపూడి, పెసర్లంక రహదారి



ఓలేరు సమీపంలో వరద నీటిలో నాని కుళ్ళిపోయిన బెండతోట



బయటపడ్డ మోర్తోట ముక్తేశ్వరస్వామి

ఏఓల ప్రమోషన్‌లు.. ఇంకెప్పుడు ?!

- పదోన్నతి ఫైల్‌కు కొర్రీల మీద కొర్రీలు

(5వ పేజీ తరువాయి..)

ఇవ్వాల్సి ఉండగా, కేవలం 10 మందితో మాత్రమే జాబితా రూపొందించారు. అలా రూపొందించిన ఫైల్ ను చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినాకు పంపటం తో ఆమె ఇదేం పద్ధతి అని అధికారులను నిలదీసినట్లు తెలుసున్నది. నిబంధనల ప్రకారం ఫైల్ సిద్ధం చేయాలని చైర్ పర్సన్ అధికారులను ఆదేశించినట్లు తెలుస్తుంది.

సీనియర్ అసిస్టెంట్ లకు ఏఓ లుగా ప్రమోషన్ లు సకాలంలో ఇస్తే ఎంపీడీఓలు అయ్యే అవకాశం ఉంది. ఎంపీ డీఓ ల ప్రమోషన్ ప్రక్రియ మల్టీ జోనల్ కు చెందినది కాబట్టి ఉమ్మడి జిల్లా లో ప్రస్తుతం ఏఓ ప్రమోషన్ కోసం ఎదురు చూస్తున్న వారికి భారీ నష్టం జరిగిందని చెప్పక తప్పదు. ఇప్పటికే మిగిలిన అన్ని జిల్లాల్లో ఏఓ ప్రమోషన్ ల ప్రక్రియ ముగిసినందున ఉమ్మడి జిల్లా లో వారు ఎంపీడీఓ లు అయ్యే అవకాశం చాలా వరకు కోల్పోయారు అని చెప్పకతప్పదు. ఎంపీ డీఓ ప్రమోషన్ కోసం సుమారు మూడేళ్ల పాటు వెనక బడినట్లే నని చెబుతున్నారు.ఇప్పటికైనా జిల్లా పరిషత్ అధికారులు స్పందించి సత్వరమే ప్రమోషన్ ఫైల్ కు మోక్షం కల్పించాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సొసైటీ బ్యాంకుల్లో భోక్తలను వదిలేది లేదు

- డీసీసీబీ చైర్మన్ మక్కెన

(5వ పేజీ తరువాయి..)

తెలిసిందన్నారు. నల్లపాడులో మిర్చి లేకున్నా ఉన్నట్లు చూపి అక్రమంగా రుణాలు పొందారని.. వీటన్నింటిపై సమగ్ర విచారణ జరుగుతుందన్నారు. వినుకొండలో నకిలీ పాస్‌బుక్‌ల భాగోతంలో అక్రమార్కులను వదిలేది లేదన్నారు. అక్రమాలను నిగ్గు తేల్చేందుకు ఇప్పటికే కూటమి ప్రభుత్వం ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర, అమరనాథ్ వంటి నేతలతో హౌస్ కమిటీ వేసిందని గుర్తుచేశారు. త్వరలో హౌస్ కమిటీ గుంటూరు జిల్లా పర్యటనకు వస్తుందని తెలిపారు. అక్రమార్కుల నుంచి ప్రతి రూపాయిని రికవరీ చేస్తామని స్పష్టం చేశారు. డీసీసీబీ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న నాలుగు నెలల్లో క్రాప్, సీసీ, ఎల్‌టీ రుణాలు మొత్తం రూ. 500 కోట్ల అందజేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కోల్డ్ స్టోరేజ్‌లను, గొడౌన్‌లను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. పల్నాడు శావల్యాపురం పెట్రోల్ బంకులు ఇప్పటికే ఏర్పాటుచేయగా.. ఈపూరులో బంకు మంజూరు చేశామన్నారు. అలానే మెడికల్ షాపులు కూడా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

తిరుగు ప్రయాణికులతో కిటకిట!

- పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లు ఫుల్

గుంటూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): దసరా పర్వదినం ముగియటంతో స్వస్థలాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులతో ఆర్టీసీ బస్టాండ్లు కిటకిట లాడాయి. గుంటూరులోని ఎన్‌టీఆర్ బస్టాండ్‌తో పాటు మంగళగిరి, పొన్నూరు, తెనాలి బస్టాండ్‌లలో శుక్రవారం ప్రయాణికుల రద్దీ పెరిగింది. విద్యా సంస్థలు పునఃప్రారంభం కావడంతో.. అందరూ సొంతూళ్లకు పయనమయ్యారు. గుంటూరు నుంచి హైదరాబాద్, చెన్నై, బెంగళూరుకు ఇప్పటికే ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డీపీటీవో సీహెచ్ విమల తెలిపారు. విజయవాడ, మాచర్ల, బాపట్ల, తెనాలి రూట్‌లలో రద్దీ పెరిగింది. ముఖ్యంగా స్త్రీ శక్తి పథకం వర్తించే పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులలో 100 శాతం ఆక్యుపెన్సీ దాటుతున్నాయి. రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులు నడుపుతామని డీపీటీవో స్పష్టం చేశారు.



బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ



స్వస్థలానికి వెళ్తూ..



బస్సు ఎక్కేందుకు పోటీపడుతున్న ప్రయాణికులు

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

రైలు ఢీకొని వృద్ధురాలికి తీవ్ర గాయాలు

తెనాలి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని వృద్ధురాలికి తీవ్రగాయాలైన ఘటన భట్టిప్రోలు మండలం పెనుమర్రు గ్రామ శివారుల్లో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం ఉదయం భట్టిప్రోలు మండలం పెనుమర్రు గ్రామం వద్ద ట్రాక్ దాటేందుకు యత్నించిన వృద్ధురాలిని తెనాలి నుంచి రేపల్లె వెళ్లే ట్రైన్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడింది. గమనించిన స్థానికులు 108 వాహనం ద్వారా సమీపంలోని రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వృద్ధురాలి వివరాలు తెలియాల్సి ఉందని ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.


అమ్మవారి ఊరేగింపులో ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్


తెనాలి మారీసుపేటలో అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు


అప్పలస్వామి ఆలయంలో పూజలందుకున్న అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు



శివాజీచౌక్‌లో బాలికలకు బహుమతులు అందజేస్తున్న రమణరావు, రమేష్


కొల్లిపరలో అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు


పొన్నూరులో నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులు

ముగిసిన దేవీ నవరాత్రి ఉత్సవాలు

● రథంపై అమ్మవారి ఊరేగింపు, భక్తులకు అన్నదానం



మహాలక్ష్మీ అమ్మవారుగా దశావతార వెంకన్న సన్నిధిలోని అమ్మవారు, పుష్పశయన అలంకారంలో దర్శనమిస్తున్న పొన్నూరు వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు

తెనాలి అర్బన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు పట్టణంలో గురువారం రాత్రి ఘనంగా ముగిశాయి. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి ఆలయాల్లో అమ్మవారి పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారిని అలంకరించిన రథంపై ఉంచి మంగళ వాయిద్యాలు, విచిత్ర వేషధారణలు, బాణసంచా మోతలతో పట్టణంలో వైభవంగా ఊరేగించారు. శివాజీ చౌక్‌లో నిర్వహించిన ఉత్సవాల్లో సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చిన కూచిపూడి నృత్య కళాకారులకు విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ కమిటీ సభ్యుడు తోటకూర వెంకటరమణ రావు, కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గుమ్మడి రమేష్, యర్రు శ్రీనివాసరావు తదితరులు బహుమతులు అందజేశారు. మారీసుపేట అమ్మవారి ఊరేగింపులో కమిటీ ఛైర్మన్ గ్రంధిసేతు మాధవరావు, పొన్నూరు నాగశశిధర్, వరద శేషగిరిరావు, అంకమ్మరాజు పాల్గొన్నారు. వాసవీ ఆలయ అమ్మవారి ఊరేగింపులో పారిశ్రామికవేత్త మునగాల మోహన శ్యాంప్రసాద్, దేసు శ్రీనివాసరావు, పెండేల వెంకట్రావు, గంగాధరరావు పాల్గొన్నారు. అప్పలస్వామి ఆలయంలో పూజలు అందుకున్న అమ్మవారి ఊరేగింపులో మహిళలు, కోలాటం, భజన కీర్తనలు నిర్వహించారు. శివానంద్, నారాయణస్వామి, అంజనేయ ప్రసాద్, సుబ్రహ్మణ్యశర్మ పాల్గొన్నారు. చెంచుపేట గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో పాలాభిషేకం నిర్వహించారు. దాతలు కనగాల సత్యనారాయణ రూ.2 లక్షల విలువైన విగ్రహాలను అందజేశారు. తుమ్మల సత్యనారాయణ, ఉమామహేశ్వరరావు, కృష్ణారెడ్డి, పుష్పకుమారి పాల్గొన్నారు. బోసురోడ్డులోని షిరిడి సాయిబాబా మందిర సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా ఉత్సవాల్లో శుక్రవారం సాయిబాబాను అలకరించిన వాహనంపై పట్టణ వీధుల్లో ఘనంగా ఊరేగించారు. భక్తులకు అన్నదానం చేశారు. దేవీచౌక్‌లో జరిగిన ఉత్సవాల్లో భక్తులకు అన్నదానం చేశారు. ఛైర్మన్ పీవీఎస్ శాస్త్రి, కొండపి శ్రీనివాసరావు, వీరభద్రశర్మ, కమిటీ సభ్యులు పాల్గొని మహిళలకు, పురుషులకు వేర్వేరుగా అన్నదానం నిర్వహించారు.

● చేబ్రోలు: చేబ్రోలు మండలం శలపాడులో శ్రీదుర్గాభవాని ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో గురుపారం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దసరా పండుగను ఘనంగా నిర్వహించారు. దీపోత్సవ కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన లక్కీ డ్రాలో గెలుపొందిన విజేతలకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. చేబ్రోలు కూరగాయల మార్కెట్ దగ్గర ఏర్పాటు చేసిన మండపంలో వైభవంగా ఉత్సవాలు నిర్వహించారు. గురువారం అమ్మవారిని రాజరాజేశ్వరిగా అలంకరించారు. భక్తులు అధికసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

● పెదకాకాని: మండల పరిధిలోని నంబూరు పాలకేంద్రం ఎదురుగా ఉన్న శ్రీఈశ్వరమ్మ అమ్మ వారి గుడి ఆవరణలో దసరా సందర్భంగా కనకదుర్గమ్మ అమ్మ విగ్రహం ఏర్పాటు చేసి నవరాత్రులు పూజా కార్యక్రమం గురువారంతో ముగిశారు. శుక్రవారం జరిగిన అమ్మవారి విగ్రహం ఊరేగింపు కార్యక్రమంలో పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యుడు ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించి, ఊరేగింపులో ట్రాక్టర్ నడిపారు. గత ఎన్నికల సమయంలో మొక్కుబడులను ఎమ్మెల్యే నరేంద్ర తీర్చుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● పెదకాకాని: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట ఉన్న దశావతార వేంకటేశ్వరస్వామి వారి దివ్యక్షేత్రంలో కొలువై ఉన్న శ్రీమహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో చివరి రోజు గురువారం అమ్మవారు మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. స్వామివారికి సామూహిక హోమ కల్యాణం జరిపించారు. ఆలయంలో ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. ఉత్సవాలను ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణభాస్కరరావు దంపతులు పర్యవేక్షించారు.

● పెదకాకాని: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ముగిశాయి. భ్రమరాంబ అమ్మవారు గురువారం రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దసరా ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా ముగించారు.

● పొన్నూరు టౌన్: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు గురువారం వైభవంగా ముగిశాయి. 11 రోజులపాటు వివిధ అలంకారాలలో పూజలు అందుకున్న అమ్మవారు చివరి రోజు శ్రీ రాజరాజేశ్వరి దేవిగా పూజలు అందుకుంది. నిజరూపంలో దర్శనం ఇచ్చిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయాలకు బారులు తీరారు. దసరా పండుగను పురస్కరించుకొని ఆలయాల్లో ప్రత్యేకంగా పూజలు జరిగాయి. శ్రీ కనకదుర్గ భవాని ఆలయంలో పూజలందుకున్న ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై నగరోత్సవం నిర్వహించారు. పట్టణంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు పుష్పశయన అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. పట్టణంలోని శ్రీకాశీవిశాలాక్షమ్మ, సహస్రలింగేశ్వరస్వామి ఆలయంలోని పార్వతీదేవి, నిడుబ్రోలు రాజరాజేశ్వరిదేవి, చింతలపూడి భ్రమరాంబాదేవి తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దసరా పండుగను పురస్కరించుకొని శమీ పూజలు జరిపారు. పలు ప్రాంతాలలో ఆయుధపూజ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం నిర్వహించిన చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కూచిపూడి నాట్య గురువు నటరాజ కూచిపూడి నాట్య నిలయం వ్యవస్థాపకులు ఓంకారేశ్వరి శిష్య బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన చిన్నారుల నృత్యం ప్రదర్శన ఆకట్టుకుంది. శ్రీనివాస కల్యాణం ఘట్టం మంత్రముగ్ధులను చేసింది. కార్యక్రమంలో పట్టణవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

● కొల్లిపర: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం దుర్గాదేవి నిమజ్జనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. మండలంలో వల్లభాపురం, మున్నంగి, తూములూరు, అత్తోట, దావులూరుపాలెం తదితర గ్రామాల్లో ఏర్పాటుచేసిన దుర్గాదేవి అమ్మవారి విగ్రహాలకు భక్తులు 12 రోజుల నుంచి వైభవంగా పూజలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్లపై అమ్మవారి విగ్రహాలను మేళతాళాలతో ఊరేగించారు. ఆర్యవైశ్య సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు అన్నవరపు రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారికి మహిళలు పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై దుర్గాదేవి విగ్రహాన్ని ఊరేగించి, కృష్ణానదిలో నిమజ్జనం చేశారు.


చేబ్రోలులో జరిగిన దీపోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు


కమిషనర్ అప్పలనాయుడుకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకుతున్న ప్రణాళిక విభాగం అధికారులు

మున్సిపల్ కమిషనర్‌గా అప్పలనాయుడు

తెనాలి అర్బన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): తెనాలి మున్సిపల్ కమిషనర్‌గా రామ అప్పలనాయుడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ కార్యాలయానికి విధుల్లో చేరేందుకు వచ్చిన ఆయనకు ప్రణాళిక విభాగం అధికారులు శివన్నారాయణ, సాంబశివరావు, మేనేజర్ రాంప్రసాద్, హెల్త్ ఆఫీసర్ యేసుబాబు, వివిధ విభాగాల సిబ్బంది పుష్పగుచ్చాలతో స్వాగతం పలికారు. అనంతరం కమిషనర్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధికను మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని కమిషనర్ పేర్కొన్నారు.


పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్, తదితరులు

పారిశుధ్య కార్మికుల సేవలు వెల కట్టలేనివి

● ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

పొన్నూరు టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని గురువారం పొన్నూరు పట్టణంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణంలోని గుంటూరు బస్టాండ్ సెంటర్‌లో జరిగిన వేడుకల్లో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మహాత్మాగాంధీ సేవలను కొనియాడారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు పురపాలక సంఘం ద్వారా దుస్తులు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికుల సేవలను కొనియాడారు. పొన్నూరు పట్టణాన్ని స్వచ్ఛ పొన్నూరుగా తీర్చిదిద్దే సంకల్పంలో పారిశుధ్య కార్మికులదే ముఖ్య భూమిక అన్నారు. గాంధీ జయంతి రోజున పారిశుధ్య కార్మికులకు సేవచేసే అవకాశం లభించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు, మాజీ వైస్‌ఛైర్మన్ ఆకుల సాంబశివరావు, కనీస వేతనాల కమిటీ సభ్యులు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, పఠాన్ అహ్మద్‌ఖాన్, మాదాల వెంకటేశ్వరరావు, స్టాండింగ్ కౌన్సిల్ తూమాటి రమేష్, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు మగ్బుల్ బేగ్, జీఎంఎస్ గుప్తా, యాసిన్ బాబా, బండారుపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


మండల అధ్యక్షుడు నారిశెట్టి శ్రీరామచంద్రమూర్తి, కార్యకర్తలు

ఘనంగా లాల్ బహదూర్‌శాస్త్రి జయంతి

చేబ్రోలు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): భారతదేశ రెండో ప్రధాని, 'జై జవాన్-జై కిసాన్ నినాద స్ఫూర్తికర్త లాల్‌బహదూర్ శాస్త్రి జయంతిని గురువారం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు నారిశెట్టి శ్రీరామచంద్రమూర్తి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తన్నీరు రామకృష్ణ మాట్లాడుతూ, శాస్త్రీజీ నిరాడంబర జీవితం, సాదాసీదా వ్యక్తిత్వం, దేశ సేవపై ఆయన చూపిన కట్టుబాటును కొనియాడారు. ఆయన చూపిన మార్గం యువతకు ప్రేరణగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు పాలడుగు శ్రీనివాస్, అన్నపురెడ్డి సాంబిరెడ్డి, మాడ సీతారామయ్య, జూటూరు మురళి పాల్గొన్నారు.


అవార్డు అందుకున్న షేక్ మస్తాన్‌ను సన్మానిస్తున్న మైనారిటీ నాయకులు

జాతీయ అవార్డు గ్రహీత మస్తాన్‌కు సన్మానం

పొన్నూరు టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాల ద్వారా జాతీయ అవార్డు అందుకున్న మాజీ సైనికుడు షేక్ మస్తాన్‌ను శుక్రవారం తెలుగుదేశం పార్టీ మైనారిటీ నాయకులు ఘనంగా సత్కరించారు. పొన్నూరు పట్టణానికి చెందిన పొన్నూరు ఎక్స్ సర్వీస్ మెన్ సర్వీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్న మేజర్ సుబేదార్ లెఫ్టినెంట్ షేక్ మస్తాన్ అనేక సేవా కార్యక్రమాలను పొన్నూరు ప్రాంతంలో 2020 నుంచి నిర్వహిస్తున్నారు. షేక్ మస్తాన్ సేవలను గుర్తించిన మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ శాఖ వికసిత భారత్ 247లో భాగంగా నేషనల్ కాంక్లేవ్ 2025లో రక్షణశాఖ మంత్రి రాజనాథ్‌సింగ్ చేతుల మీదుగా షేక్ మస్తాన్‌ను ఘనంగా సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పొన్నూరుకు సేవా కార్యక్రమాల ద్వారా జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన షేక్ మస్తాన్‌ను తెలుగుదేశం పార్టీ మైనారిటీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, పట్టణ అధ్యక్షుడు పఠాన్ అహ్మద్‌ఖాన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ బాజీ సాహెబ్, మైనారిటీ నాయకులు జానీబేగ్, ఖదీర్, సిలార్‌బాషా, మౌలాలి, ఇస్మాయిల్, కాజా, ఫైజుల్లా ఖాన్, బాజీ, రియాజ్ ఘనంగా సత్కరించారు.

మేనల్లుడిని కాపాడబోయి మేనమామ మృతి

తెనాలి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మేనల్లుడిని కాపాడబోయి మేనమామ మృతి చెందిన ఘటనతో తెనాలి చినరావూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక చినరావూరుకు చెందిన కేతావత్ రామునాయక్ (34) తన కుటుంబంతో కలిసి దసరా కొలుపులకు నల్గొండ జిల్లా దిండి మండలం దేవరచర్లలో ఉంటున్న బంధువుల ఇంటికి వెళ్లాడు. అక్కడ ఉత్సవాలు ముగిసి గురువారం తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యారు. ఐతే తన మేనల్లుడు ఉమాకాంత్ (10) నదీ ప్రవాహం చూద్దామని రామునాయక్‌కు చెప్పడంతో అక్కడికి వెళ్లారు. ప్రమాదవశాత్తూ నదీప్రవాహంలో మేనల్లుడు పడిపోవడంతో అతడిని కాపాడేందుకు రామునాయక్ దిగి నీటి ప్రవాహానికి అతడు కూడా మునిగిపోయి ప్రాణాలు విడిచాడు. రామునాయక్‌కు వివాహమై భార్య ఇరువురు పిల్లలున్నారు. పండుగ వేళ ఆనందంగా గడిపి తిరిగి సొంత ప్రాంతమైన తెనాలి రావాల్సిన రామునాయక్ అనుకోని ప్రమాదంలో మృతిచెందాడన్న విషయం తెలియడంతో చినరావూరు ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

సమన్వయంతో పనిచేద్దాం: అంబటి మురళీ కృష్ణ

పొన్నూరు టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పొన్నూరులో సమన్వయంతో పనిచేసి వైసీపీ పార్టీ బలోపేతానికి కృషి చేద్దామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అంబటి మురళీకృష్ణ అన్నారు. వైసీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్లుగా నియమితులైన డాక్టర్ నల్లమోతు రూత్ రాణి, మందపాటి శేషగిరిరావులను శుక్రవారం ఆ పార్టీ ఇన్‌చార్జి అంబటి మురళీకృష్ణ కలుసుకొని సత్కరించారు. ఈ సందర్భంగా పొన్నూరులో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.


బాధిత కుటుంబానికి సాయం అందజేస్తున్న టీడీపీ నాయకులు

అగ్ని బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

● ఏఎంసీ మాజీ ఛైర్మన్ మాదాల వెంకటేశ్వరరావు

పొన్నూరు టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అగ్ని బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ఏఎంసీ మాజీ ఛైర్మన్ మాదాల వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని పాలెం గ్రామంలో ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మూడు గృహాలు కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో ఎస్టీ కాలనీకి చెందిన సీహెచ్ యేసురాజు, బాపట్ల పోలయ్య, జంపని శంకరరావు కుటుంబం సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలారు. ఈ సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ బాధిత కుటుంబాలకు అండగా ఉండాలని టీడీపీ నాయకులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు బాధిత కుటుంబాలకు పరామర్శించి నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బండ్లమూడి బాబురావు, చల్లంశెట్టి సీతారామయ్య, గణితశెట్టి రామకృష్ణ, సోపతి వెంకటరావు, చంద్రశేఖరరావు, మనమంచి వీరయ్య చౌదరి, వెంకటేశ్వరరావు, బోడి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.


గాంధీచౌక్‌లో మహాత్మునికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్

మహాత్మాగాంధీకి ఘన నివాళి

తెనాలి అర్బన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల ఆధ్వర్యంలో గురువారం గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. గాంధీచౌక్‌లో మహాత్ముని విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చేందుకు జాతి మొత్తాన్ని ఒకతాటిపైకి తెచ్చిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మహాత్మాగాంధీ విగ్రహానికి ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెల్త్ ఆఫీసర్ మొవ్వా యేసుబాబు, మేనేజర్ రాంప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు. శ్రీవాసవీ ఆలయంలో మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, ఆలయ కమిటీ ఇన్‌చార్జి మునగాల మోహన్ శ్యాంప్రసాద్, భాస్కరుని శ్రీనివాసరావు, దేసు శ్రీనివాసరావు, సాధుప్రతాప్ తదితరులు పాల్గొన్నారు. మారీసుపేటలోని కాంగ్రెస్ కార్యాలయంలో మహాత్మునికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడు, పొన్నూరు శశి తదితరులు పాల్గొన్నారు. గాంధీ ఆశ్రమంలో గాంధీ హృదయదారి వజ్రాల రామలింగాచారి గాంధీ విగ్రహానికి పూజలు చేశారు. 156వ జయంతిని పురస్కరించుకుని 156 కిలోల ప్రసాదాలు పంపిణీ చేశారు.


వాసవీ ఆలయంలో గాంధీజీకి నివాళులర్పిస్తున్న సంఘ నాయకులు

కొల్లిపరలో...

కొల్లిపర, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపర ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద జిల్లా ఆర్యవైశ్య సంఘ ఉపాధ్యక్షుడు అన్నవరపు రమేష్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ156వ జయంతిని ఘనంగా నిర్వహించారు. గాంధీ విగ్రహానికి ఆర్యవైశ్య సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ గాంధీజీ ఆశయాలను అనుగుణంగా యువత నడవాలన్నారు. సత్యం, అహింస ఆయుధాలుగా అహోరాత్రులు శ్రమించి మనకు స్వాతంత్ర్యం తీసుకువచ్చారన్నారు. ఖద్దరును చూడగానే గాంధీ గుర్తుకు వస్తారన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు చుండూరు వెంకటరత్నం, మునగాల రామకృష్ణ, సుగ్గుల సురేష్, బొల్లుశెట్టి హరీష్, బొల్లుశెట్టి వంశీ, సుగ్గుల క్రాంతి తదితరులు పాల్గొన్నారు.


మున్సిపల్ కార్యాలయంలో గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఛైర్ పర్సన్ రాధిక, అధికారులు


కొల్లిపరలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పోతురాజు, ఆర్యవైశ్య సంఘ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ జియావుల్ హక్

రీ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం: తహసీల్దార్ జియావుల్ హక్

పొన్నూరు టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న రీ సర్వే ప్రాజెక్టు ద్వారా గ్రామాల్లో భూ సంబంధిత సమస్యలపై శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ జియావుల్ హక్ అన్నారు. మండల పరిధిలోని ఆరెమండ, దొప్పలపూడి, ఉప్పరపాలెం గ్రామాల్లో శుక్రవారం రెండో విడత రీ సర్వే ప్రాజెక్టులను తహసీల్దార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సభల ద్వారా ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను రీ సర్వే ప్రాజెక్టు ద్వారా పరిష్కరించనున్నట్లు చెప్పారు. ఆయా గ్రామాల్లో ప్రభుత్వ ప్రైవేటు అసైన్డ్ పట్టా భూములను పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి అపరిష్కృత సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. ఇప్పటికే పైలెట్ ప్రాజెక్టులో భాగంగా వల్లభరావుపాలెం గ్రామంలో రీసర్వే పూర్తిచేసినట్లు చెప్పారు. డివిజనల్ సర్వేయర్ జయరాజు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామారావు, తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ నేతల నివాళి

పశ్చిమ డెల్టాకు 7921 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టాకు 7921 క్యూసెక్కులనీరు శుక్రవారం విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా దిగువకు 1,73,175 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 270 క్యూసెక్కుల నీరు రేపల్లె కాల్వకు 1917, తూర్పు కాల్వకు 650, పశ్చిమ కాల్వకు 200, నిజాంపట్నం కాల్వకు 450, కొమ్మమూరు కాల్వకు 3560 క్యూసెక్కుల నీరు, విడుదల చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మంగళగిరి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా శనివారం మంగళగిరిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని డీఈఈ జీ.సురేష్‌కుమార్ తెలిపారు. ఇందిరా నగర్, ఎల్బీ నగర్, గణపతి నగర్, ఇప్పటం రోడ్డు, ఏపీఎస్పీ బెటాలియన్ ప్రాంతాల్లో ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

● దుగ్గిరాల మండలంలోని చిలువూరులో గల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా శనివారం నిలిపివేయనున్నట్లు ఏఈ గోపి తెలిపారు. గ్రామాల్లో నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటు నిమిత్తం, ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకూ సరఫరాలో అంతరాయ కలుగుతుందని, రైతులు, విని యోగదారులు సహకరించాలని కోరారు.

నేడు, రేపు ఉరుసు మహోత్సవం

మంగళగిరి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): 101 దర్గాలను కలిగిన పుణ్యస్థలంగా గుర్తింపు పొందిన తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలో ఈ నెల 4, 5 తేదీల్లో హజరత్ పీరానే పీర్ దస్తగీర్ మహబూబ్ సుభానీ అవులియా బాబా 73వ ఉరుసు మహోత్సవాలు జరుగుతాయని ముజవర్ షేక్ షబ్బీర్ తాజ్‌వుల్ ఖాద్రి తెలిపారు. శనివారం రాత్రి 8 గంటలకు గంధం, అనంతరం అన్న సంతర్పణ జరుగుతాయన్నారు. ఆదివారం దీపారాధన, ప్రత్యేక ప్రార్థనలు, ధార్మిక కార్యక్రమాలు జరుగుతాయని, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

7న క్రికెట్ నైపుణ్య శిబిరం

గుంటూరు(తూర్పు), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జీడీసీఏ ఆధ్వర్యంలో స్థానిక పేరేచర్ల మైదానం ఈ నెల 7న క్రికెట్ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్టు త్రీ మెన్ కమిటీ సభ్యులు మహతి శంకర్, మనోజ్‌సాయి, సుధాకర్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, 16, 19 బాలురు, అండర్-15, 19 బాలికల విభాగాల్లో ఈ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఆసక్తి కల్గిన క్రీడాకారులు అదే రోజున ఉదయం 7 గంటలకు తమ సొంత కిట్‌లతో రిపోర్టు చేయాలని అన్నారు.

బ్యాటరీ దుకాణంలో చోరీ

పెదనందిపాడు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీవెంకటేశ్వర బ్యాటరీ దుకాణంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం దుకాణం షటర్ పగులగొట్టి రూ.7 వేలు నగదుతో పాటు బ్యాటరీలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు సీహెచ్ శ్రీనివాసరావు స్థానిక పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్‌ఐ మధుపవన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆవుల అదృశ్యంపై కేసు

తుళ్లూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) : ఆవుల అదృశ్యంపై తుళ్లూరు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. మండలంలోని అనంతవరం గ్రామ గోశాల నుంచి 16 ఆవులు రాత్రికి రాత్రే అదృశ్యమైనట్టు వెంకటేశ్వర గోశాల నిర్వాహకులు తోట సురేష్ ఫిర్యాదు చేశారు. దీనిపై తుళ్లూరు సీఐ-2 అంజయ్య తెలిపిన వివరాల ప్రకారం కృష్ణా జల్లా ఇబ్రహీంపట్నంకు చెందిన కొంత మంది రైతులు నాలుగు రోజుల క్రితం అనంతవరం గోశాలకు 5 గోవులను అప్పజెప్పారు. ఆవుల యజయానులు ఇది తెలుసుకొని అనంతవరం గోశాలకు వచ్చి ఆవులు తమవని తీసుకెళ్లారు. వాటితో పాటు మరో 16 ఆవులను తీసుకెళ్లారని తోట సురేష్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

సృష్టికర్త అల్లాను ఆరాధించాలి

మంగళగిరి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): సృష్టికర్త అల్లాను మాత్రమే ఆరాధించాలని, బహు దైవారాధన చేయరాదని నజీర్ అహ్మద్‌ఖాన్ సాహెబ్ అన్నారు. మంగళగిరి మండలం ఎర్రబాలెం బసవతారక నగర్‌లోని మసీద్-ఏ-మొహమ్మద్‌లో శుక్రవారం దేవుని ఏకత్వం అనే అంశంపై ఆయన జుమా ప్రసంగం చేశారు. ముస్లింలు శుక్రవారం జుమా నమాజ్ అనగానే తెల్లటి వస్త్రాలు ధరించి మసీదులకు రావడమే కాదని, వారి జీవితాల్లో మార్పులు రావాలని అభిప్రాయపడ్డారు. అల్లాను నమ్మిన వారికి స్వర్గప్రాప్తి లభిస్తుందని తెలిపారు.

ఆటో డ్రైవర్లు తరలిరావాలి

పెదనందిపాడు, ప్రత్తిపాడు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దసరా కానుకగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా ఆటో డ్రైవర్ల సేవలో పథకం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఎంపీడీవోలు స్వామిరెడ్డి, శివపార్వతిలు శుక్రవారం తెలిపారు. విజయవాడలో జరిగే ఈ కార్యక్రమానికి ఆటోడ్రైవర్లు తప్పనిసరిగా హాజరుకావాలని, తొలుత ప్రత్తిపాడు ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

304వ రోజుకు చేరిన దీక్షలు

తాడేపల్లిటౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏసిసి సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావలసిన బకాయిల కోసం చేస్తున్న దీక్షలు శుక్రవారంతో 304వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను యూనియన్ నేత కె.స్టీవెన్ ఆదినారాయణ తుపాకుల నాగేశ్వరరావు, సాంబశివరావు, ఆశీర్వాదం ప్రారంభించారు.

భక్తిశ్రద్ధలతో విజయ దశమి వేడుకలు



మంగళగిరిలో విజయదుర్గ అలంకారంలో కనకదుర్గమ్మ



పెదనందిపాడు: పాలపర్రులో ఊరేగింపుగా తరలివెళ్తున్న కనకదుర్గమ్మ



వట్టిచెరుకూరులో దుర్గాదేవి అలంకారంలో అమ్మవారు

మంగళగిరి సిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): విజయ దశమి పండుగను మంగళగిరి ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తొమ్మిది రోజులుగా నిత్యం వివిధ రూపాల్లో దర్శనమిచ్చిన అమ్మవారు విజయ దశమి నాడు ప్రత్యేక అలంకారంలో భక్తులను అనుగ్రహించారు. పాతమంగళగిరి దుర్గానగర్‌లో ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారు విజయదుర్గగా దర్శనమిచ్చారు. అమ్మవారికి కుంకుమార్చనలు చేసి భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు. అనంతరం పురవీధుల్లో పులి వాహనంపై అమ్మవారి గ్రామోత్సవం జరిగింది. భక్త బృందం ప్రతినిధి ఇంటూరి దుర్గాప్రసాద్ ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. మంగళగిరి శివాలయంలోని శ్రీభ్రమరాంబిక అమ్మవారికి పుష్పశయ్య అలంకారంలో కుంకుమార్చన, శమీపూజ నిర్వహించారు. రాజీవ్ గృహకల్ప రోడ్డులోని శ్రీకాళీమాత అమ్మవారు దశమి నాడు రాజరాజేశ్వరీ అలంకారంలో దర్శనమిచ్చారు. నృసింహాలయంలో శమీ పూజ, పార్వేట ఉత్సవం జరిగాయి. స్టేషన్ రోడ్డులోని శ్రీ అఖిలాండేశ్వరీ అమ్మవారు రాజరాజేశ్వరీ దేవిగా దర్శనమిచ్చారు.

● దుగ్గిరాల మండలంలోని పలు గామాల్లోని పలుగ్రామాల్లో ఆలయాల్లో అమ్మవారు శ్రీరాజరాజే శ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శమీపూజ నిర్వహించారు. కేఆర్‌కొండూరు శ్రీమహంకాళీ అమ్మ వారు, దుగ్గిరాల శ్రీగంగాపార్వతీ సమేత శ్రీనాగేశ్వర స్వామివారి ఆలయంలో అమ్మవారు, పెదకొండూరులోని శ్రీకనక పుట్టలమ్మవారు, శృంగాపురంలోనూ శ్రీరాజ రాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు అర్చకులు సుబ్రహ్మణ్య శర్మ, తారక్‌నాథ్‌శర్మ, పీ.మణి కృష్ణశర్మ, ఎన్. యుగంధర్‌శర్మలు భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. కేఆర్‌కొండూరు శ్రీమహంకాళీ అమ్మవారి ఆలయంలో శ్రీచండీహోమం కొనసాగించారు. ఈవో కోగంటి సునీల్‌కుమార్, ఫౌండర్‌ట్రస్టీ రంగప్రసాద్ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● వట్టిచెరుకూరు మండలంలోని ఆయా దేవాలయాల్లో అమ్మవార్లు దుర్గాదేవి అలంకారాల్లో దర్శనమిచ్చారు. వట్టిచెరుకూరు గ్రామంలో చిరుమామిళ్ళ మల్లికార్జునరావు (మైనింగ్ సైంటిస్టు) గృహంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం గురువారం వరకు నీరాజనాలు అందుకుంది. గురువారం రాత్రి దుర్గాదేవి అలంకారంలో గ్రామంలో భారీ ఎత్తున ఊరేగింపు నిర్వహిస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో మహిళలు ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు. లేమల్లెపాడులో పోలేరమ్మ ఆలయంలో దుర్గాదేవి అలంకరణతో ముగిసింది. శుక్రవారం రాత్రి దుర్గాదేవి విగ్రహాన్ని గ్రామంలో భారీ ఎత్తున ఊరేగింపు కొనసాగగా అడుగడుగునా మహిళలు హారతులు పట్టారు. స్థానిక చెరువులో అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.



శ్రీరాజరాజేశ్వరీదేవి అలంకారంలో కేఆర్‌కొండూరు శ్రీమహంకాళీ అమ్మవారు

● పెదనందిపాడు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో 10రోజులుగా జరుగుతున్న విజయదశమి వేడుకలు శుక్రవారంతో ముగిశాయి. ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్లపై ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జన కార్యక్రమం చేశారు.

● తుళ్లూరు మండలంలోని దేవాలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు.

రాజధాని రైతుల సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్‌డే

● పిటిషన్లు స్వీకరించిన సీఆర్డీఏ నోడల్ ఆఫీసర్ పి.జయశ్రీ



రైతుల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న సీఆర్డీఏ అధికారులు

తుళ్లూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని ప్రాంత రైతులు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఏపీ సీఆర్డీఏ శుక్రవారం తుళ్లూరులోని కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహించింది. ఈ కార్యక్రమంలో రాజధాని ప్రాంతానికి చెందిన పలువురు రైతులు, వ్యవసాయ కూలీలు తమ పిటిషన్లను గ్రీవెన్స్ నోడల్ ఆఫీసర్ పి.జయశ్రీకి సమర్పించారు. పిటిషన్ దారులకు త్వరగా పరిష్కారం అందించేలా చర్యలు తీసుకుంటామని ఆమె భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల అధికారులు హాజరై పలు ఫిర్యాదులను వెంటనే పరిష్కరించారు. మిగిలిన ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలని, వాటిని పరిష్కరించడంలో ఎలాంటి నిర్లక్ష్యం చూపకూడదని జయశ్రీ అధికారులను ఆదేశించారు. రైతులు ప్రతి శుక్రవారం ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు నిర్వహించే గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని ఆమె సూచించారు. గ్రీవెన్స్ డేలో మొత్తం 25 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.శేషిరెడ్డి, పి. పద్మావతి, బి.శ్రీనివాసనాయక్, జి.భీమరావు, కేఎస్.భాగ్యరేఖ, ఎం.శేషిరెడ్డి, జోనల్ జాయింట్ డైరెక్టర్ సీహెచ్ మధుసూదన్ రావు, సామాజిక సంక్షేమ విభాగం అధికారి బొర్రా శ్రీనివాసరావు, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉద్యమ్ ఆధార్‌తో సంస్థలకు ఎంతో మేలు

● ఎంఎస్‌ఎంఈ కోఆర్డినేటర్ నాగేందర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎస్‌ఎంఈ కోఆర్డినేటర్ నాగేందర్

పెదనందిపాడు, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): ఉద్యమ్ ఆధార్ చేయించుకోవడం వల్ల సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి వ్యాపార సంస్థలకు ఎంతో మేలు చేకూరుతుందని ఎంఎస్‌ఎంఈ కోఆర్డినేటర్ నాగేందర్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం వ్యాపార సంస్థల యజమానులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమ్ ఆధార్‌లో నమోదు చేసుకోవడం వల్ల రుణసదుపాయం కలుగుతుందని, రుణాలు పొందిన వారు సకాలంలో చెల్లింపులు జరపాలన్నారు. ఇటీవల ఎన్డీయే ప్రభుత్వం నిత్యావసర వస్తువలు, ఇతర వస్తువులపై జీఎస్టీ తగ్గింపులు చేసిందని. దీనిపై వినియోగదారులకు అవగాహన కల్పించాలన్నారు. మహిళలు కూడా దీనిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో స్వామిరెడ్డి, ఏపీఎం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

దళితులకు అండ.. కేవీపీఎస్ జెండా...

● సంఘం జిల్లా కార్యదర్శి జొన్నకూటి

తాడేపల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాల హక్కుల కోసం కులవివక్షకు వ్యతిరేకంగా రాజీ లేకుండా పోరాడే సం ఘం కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) అని ఆ సంఘం జిల్లా కార్యదర్శి జొన్నకూటి నవీన్ ప్రకాష్ చెప్పారు. కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ముగ్గురోడ్డులో ఆ సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నవీన్‌ప్రకాష్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్ల గడిచినా నేటికీ వివిధ రూపాల్లో వివక్ష కొనసాగడం దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు అపహాస్యమవుతున్నాయన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న గత 11 ఏళ్ల కాలంలో దళితులపై దాడులు, దౌర్జన్యాలు అధికమయ్యాయని ఆరోపించా రు. భారతరాజ్యాంగమే అందరికి అత్యుత్తమమైన గ్రంథమన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నేతలు దర్శనపు విజయబాబు, బర్నబాస్, బాబూరావు, గాదె సుబ్బారెడ్డి, వై శ్రీనివాసరావు, స్థానికులు పాల్గొన్నారు.

నేడు సురవరం సంస్మరణ సభ

మంగళగిరి సిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ శనివారం సాయంత్రం మంగళగిరి వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో జరుగుతుందని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య తెలిపారు. మంగళగిరిలో జరుగనున్న సంస్మరణ సభకు కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచార శాఖా మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కే.నారాయణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఏపీఎంఎస్ ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు తదితర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు.



ముస్లింల సమైక్యతకు ప్రతీకగా జరుపుకునే గ్యార్మి పండుగ సందర్భంగా జెండాను ప్రత్యేకంగా సిద్ధం చేసి గ్రామంలో మేళతాళాలతో ఊరేగించారు. దుగ్గిరాలలో జెండా చెట్టు నుంచి ప్రారంభమైన ఊరేగింపు మెయిన్‌రోడ్‌లోనూ, ఇతర వీధుల్లోనూ అర్ధరాత్రి వరకూ కొనసాగింది. ముస్లింలు, మహిళలు జెండాను ఊరేంపును చూసేందుకు తరలివచ్చారు. (దుగ్గిరాల, ఆంధ్రజ్యోతి)

అంధకారంలో అన్నపర్రు ఎస్సీకాలనీ

● పట్టించుకోని విద్యుత్ అధికారులు

● రెండు రోజులుగా ఇదేతంతు

పెదనందిపాడు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): వేళాపాళాలేని విద్యుత్ కోతల వలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అన్నపర్రు ఎస్సీ కాలనీ వాసులు వాపోతున్నారు. గత రెండు రోజులుగా కాలనీలో ఇదే పరిస్థితి నెలకొందని, విద్యుత్ ఎందుకు నిలిపివేశారని ప్రశ్నిస్తే కనీసం అధికారులు సమాధానం కూడా చెప్పడం లేదని విద్యుత్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల అన్నవరం గ్రామంలో కూడా ఇదే పరిస్థితి నెలకొనగా ఇప్పటికీ సమస్య పరిష్కరించలేదని, ఇప్పుడు తాజాగా అన్నపర్రులో ఈ సమస్య తలెత్తడంతో వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు సమస్యపై దృష్టిసారించి పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేస్తాం

● మండల అధ్యక్షుడు కోడూరి రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు కోడూరి రాంబాబు, నాయకులు

పెదనందిపాడు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజాసమస్యలు పరిష్కరిస్తూ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని టీడీపీ మండల అధ్యక్షుడు కోడూరి రాంబాబు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం విజయదశమి వేడుకల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని నాయకులను కలుపుకొని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో టీడీపీ జెండా ఎగురవేస్తామని తెలిపారు. తన ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని విజయవంతం చేసిన తెలుగుదేశం పార్టీ కుటుంబసభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు రావి శివరామకృష్ణయ్య, ఎన్నారై టీడీపీ లాస్‌ఏంజెల్స్ అధ్యక్షుడు ఆళ్ల వెంకట్, తెలుగు మహిళా అధ్యక్షురాలు చిన్నం ఈశ్వరమ్మ, నాయకులు నాగండ్ల శ్రీనివాసరావు, రామినేని శ్రీనివాసరావు, దివ్వి నాగరాజు, ఆళ్ల రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా పుణ్యతిథి



సాయిమందిర్‌లో బాబా సమాధి వద్ద పూజలు చేస్తున్న భక్తులు

పెదనందిపాడు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిమందిర్‌లో బాబా వారి 108వ పుణ్యతిథి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బాబాకి అర్చకులు మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి, విశేషంగా అలంకరించారు. బాబా సమాధిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వస్త్రాల పంపిణీ

మంగళగిరి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో దేవస్థానం వద్ద గల కళావేదికలో ఎంటీఎంసీ పారిశుధ్య సిబ్బందికి నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా, అసిస్టెంట్ కమిషనర్ పట్లూరి శ్రీనివాసరావు, సత్యసాయి సేవా సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేంద్ర, జిల్లా కోఆర్డినేటర్ శిరీష, మహిళా సేవాదళ్ కోఆర్డినేటర్ హేమలత, మెడికల్ కోఆర్డినేటర్ ఈ.సాయికృష్ణ, ఉదయలక్ష్మీ, మంగళగిరి కన్వీనర్ డాక్టర్ రామారావు పాల్గొన్నారు.

ప్రజలకు కూటమి ప్రభుత్వం సూపర్ జీఎస్టీ గిఫ్ట్

● ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

ఫిరంగిపురం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సూపర్ జీఎస్టీ ద్వారా కూటమి ప్రభుత్వం సూపర్ గిఫ్ట్‌ను అందించిందని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఫిరంగిపురంలోని ఎన్టీఆర్ బొమ్మ సెంటర్‌లో జరిగిన జీఎస్టీ అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీఎస్టీ తగ్గింపుపై దుకాణాల్లో అధికారులు బోర్డులు పెట్టించాలన్నారు. వ్యాపారులు ప్రజలను మోసం చేయకుండా కూటమి నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరిగి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలను చైతన్య వంతులను చేయటమే కోసమే సమావేశాలు, సభలు ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కంచేటి బ్రహ్మయ్య, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ బేతపూడి విజయశేఖర్, వార్డు చైర్మన్ తడవర్తి కేశవరావు, మండల అధ్యక్షుడు మండవ నరసింహారావు, కొత్తపల్లి కోటేశ్వరరావు, పసల తోమాస్, ఆరే పున్నారెడ్డి, కటికల అప్పారావు, పీ హృదయరాజు, తహసీల్దార్ జే ప్రసాదరావు, ఎంపీడీవో కే రవిబాబు, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ కే కేదారేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చిలువూరులో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై ర్యాలీ



జీఎస్టీ ప్రయోజనాలపై అధికారులు చేపట్టిన అవగాహన ర్యాలీలో పాల్గొన్న రైతులు

దుగ్గిరాల, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండలగ్రామం చిలువూరులో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై గ్రామస్థులకు అవగాహన కల్పిస్తూ వీధుల్లో ర్యాలీ బుధవారం నిర్వహించారు. వ్యవసాయశాఖ, పశుసంవర్ధక శాఖ, పంచాయతీ రాజ్‌శాఖల ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో రైతులు పలు వ్యవసాయ పరికరాలతో ర్యాలీలో పాల్గొన్నారు. నిత్యావసరాలు వ్యవసాయ పనిముట్లపైన, నిత్యావసరాలపై జీఎస్టీని తగ్గించారని జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ జీ. శ్రీనివాసరావు గ్రామస్థులకు వివరించారు. పూర్తిగా జీఎస్టీ రద్దు చేసిన, జీఎస్టీ తగ్గించిన వస్తువులను కొనుగోలు చేసే ముందు దుకాణాదారులు, డిపార్ట్‌మెంట్ స్టోర్‌ల యజమానులను అడిగి కొనుగోలు చేయాలన్నారు. ఈనెల 19వతేదీ వరకూ జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. చిలువూరులోని గ్రామసచివాలయం నుంచి గ్రామవీధుల్లో కొనసాగిన ర్యాలీలో ఎంపీపీ షేక్ జబీన్, సర్పంచ్ చిలువూరు మాణిక్యం, తోటకూర సీతారామయ్య, మాజీ జడ్పీటీసీ యేళ్ల జయలక్ష్మి, పశువుల వైద్యుడు సతీష్‌రాజు, ఏవో ఆర్.విజయబాబు ఎంవీవీ ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, ఏఈఈ, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయ పరికరాలపై భారీగా జీఎస్టీ తగ్గింపు

● పీఏసీఎస్ చైర్‌పర్సన్ బత్తిని వేణుగోపాలకృష్ణ



జీఎస్టీ తగ్గింపుపై ర్యాలీలో పాల్గొన్న కూటమి నాయకులు

పెదనందిపాడు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ తగ్గింపుతో ఎన్డీయే ప్రభుత్వం సూపర్ గిఫ్ట్ ఇచ్చిందని పెదనందిపాడు పీఏసీఎస్ చైర్‌పర్సన్ బత్తిని వేణుగోపాలకృష్ణ అన్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ ద్వారా వ్యవసాయం రంగంలో కలిగే ప్రయోజనాలపై రైతాంగానికి ట్రాక్టర్లతో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. నాగులపాడు ఉపమార్కెట్‌యార్డు నుంచి పాతబస్టాండ్ సెంటర్ వద్దకు ర్యాలీగా చేరుకుని మానవహారం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ చాగంటి సత్యహర్ష, సంగం డెయిరీ డైరెక్టర్ గొల్లపూడి శ్రీనివాసరావు, మాజీ మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు మాదినేని శౌరిబాబు, తెలుగురైతు జిల్లా కార్యదర్శి మోపర్తి చెంచయ్య, తెలుగుయువత నాయకులు కాండ్రు ప్రసాద్, నూతి శ్రీనివాసరావు, కొల్లా బుచ్చియ్య, మొవ్వా నవీన్, కొల్లా హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బైకుపై విన్యాసాలు.. యువకుడి అరెస్టు



యువకుడిని అరెస్టు చూపుతున్న ఎస్‌ఐ చిరుమామిళ్ల వెంకట్

మంగళగిరి సిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రమాదకర రీతిలో బైకుపై విన్యాసాలు చేసిన యువకుడ్ని మంగళగిరి రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రూరల్ ఎస్‌ఐ చిరుమామిళ్ల వెంకట్ సదరు యువకుడిని అరెస్టు చేసి వివరాలను వెల్లడించారు. విజయవాడకు చెందిన కొండపల్లి రమేష్‌బాబు ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో గుంటూరు - విజయవాడ జాతీయ రహదారిపై ఏపీ39క్యూజే8591 నెంబరు గల స్కూటీ ద్విచక్ర వాహనంపై విన్యాసాలను ప్రదర్శించాడు. ఈ విన్యాసాల వీడియోలు సామాజిక మాధ్య మాల్లో వైరల్ కావడంతో పోలీసులు రంగంలోకి దిగారు. విజయవాడకు చెందిన రమేష్‌బాబు ఈ విన్యాసాలను నాగార్జున యూనివర్సిటీ, కాజ టోల్ ప్లాజా, చినకాకాని ప్రాంతాల్లో చేసినట్టుగా పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. యువకుడిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని ఎస్‌ఐ వెంకట్ తెలిపారు.

2000 మందికి ప్రసాదాల పంపిణీ

తాడేపల్లి టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి వద్ద విజయ దశమి రోజు బ్యారేజికి విచ్చేసిన పలువురు ప్రజలకు, భక్తులకు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు 19వ వార్డు జనసేన ఉపాధ్యక్షుడు వీరిశెట్టి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రసాదాల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ జనసేన నేత జొన్నా రాజేష్ మాట్లాడుతూ ఏపీఎంఐసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు ఓజీ సంబరాలు సేవామార్గంలో జరుపుకోవాలని సూచించారని, ఈ నేపథ్యంలో వీరిశెట్టి వెంకటేశ్వరరావు అమ్మవారి భక్తుల ఆకలి తీర్చే కార్యక్రమం చేపట్టడం హర్షణీయమన్నారు. కేఎల్ రావు కాలనీ జనసేన జెండా దిమ్మ వద్ద కూడా భక్తులకు ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి టౌన్ జనసేన అధ్యక్షుడు అంబటి తిరుపతిరావు, రాష్ట్ర ఐటీ విభాగం కోఆర్డినేటర్ చవ్వాకుల కోటేష్ బాబు, తాడేపల్లి మండల అధ్యక్షుడు సామల నాగేశ్వరరావు, జిల్లా సంయుక్త కార్యదర్శి బడే కోమలి, కాపు సంఘం నేతలు జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.

వైసీపీ ఫేక్ ప్రచారాలకు జగన్ ట్రోఫీ బహూకరణే నిదర్శనం

● కొల్లా వీరయ్యచౌదరి

కాకుమాను, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఫేక్ ప్రచారాలకు జగన్ ట్రోఫీ బహూకరణే నిదర్శనమని సంగం డెయిరి మాజీ చైర్మన్ కొల్లా వీరయ్య చౌదరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైసీపీ నాయకులు సోషల్ మీడియాలో కుట్రలు, కుయుక్తులతో తప్పుడు ప్రచారాలు చేసి ప్రజలను తప్పు దోవ పట్టించే నీచ రాజకీయాలు చేస్తున్నారని, క్రికెటర్ తిలక్ వర్మకు జగన్ ట్రోఫీ బహూకరిస్తున్నట్లు మార్ఫింగ్ ఫొటోను టీడీపీ, జనసేన బట్టబయలు చేశాయని కొల్లా చెప్పారు.